# కర్షక ప్రధాని



డా॥యలమంచిలి శివాజీ

# కర్షక ప్రధాని

ఢిల్లీ నుండి మీరట్ పోయేరోడ్డులో మోడీనగర్ అనే పారిశ్రామిక నగరం. దానికి ఆరుమైళ్ళ లోపల నూర్పూర్ అనబడే కుగ్రామం ఆ గ్రామం మొత్తంలో నున్నది రెండొందల కుటుంబాలు అందులో ఒక సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు శ్రీ చరణసింగ్. 1902 డిశెంబరు 23న. 1923లో శ్రీచరణ్ సైన్సులో పట్టభద్రుడయ్యేంత వరకూ, ఆ గ్రామంలో పట్టా పుచ్చుకొన్నవారే లేరు. అంతటితో ఆగక 1925లో పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీకూడా పొందాడు. ఆ మీదట న్యాయశాస్త్రం అభ్యసించి వకీలు పట్టాల్ ఘజియాబాద్‌లో బల్లకట్టాడు. కానీ ఆయన కార్యకలాపాలకి ఆ చిన్న తాలూకా కేంద్రం సరిపోలేదని భావించి, 1929లో మీరట్‌కు మార్చాడు, మకాం.

## పట్టుకొంటే లక్ష రూపాయలు :-

అప్పట్లో దేశమంతటా సాగుతూన్న స్వాతంత్ర్య సమరం వైపు ఆకర్షింపబడ్డాడు. శ్రీచరణ్ 1928లో సైమన్ కమీషన్ నియమించబడింది. వారు మనదేశం రావడంతో, దేశమంతటా రాజకీయావేశం తీవ్ర రూపం దాల్చింది. 1929లో జరిగిన అఖిల భారత కాంగ్రెసు మహాసభ సంపూర్ణ స్వాతంత్ర్యం తమ లక్ష్యంగా తీర్మానాన్ని ప్రకటించింది. తెల్ల

దొరలు ఏడాదిలోగా మన స్వాతంత్ర్యాన్ని గుర్తించకపోతే, పెద్ద ఎత్తున శాసనోల్లంఘనోద్యమాన్ని నడుపవలసి వస్తుందని నోటీసు యిచ్చింది కాంగ్రెసు. దేశం యావత్తూ అట్టుడికి పోతూన్న రోజులు, ఆ రోజుల్లోనే శ్రీ చరణ్‌సింగ్ కాంగ్రెసులో చేరి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నాడు, పెక్కుసార్లు కారాగారవాసం చేశాడు. యింకా పెక్కు పర్యాయాలు అజ్ఞాత వాసంతో గడిపాడు. శ్రీ చరణ్‌ను ప్రాణంతోగానీ, ప్రాణం లేకుండాగానీ పట్టియిచ్చిన వారికి లక్షరూపాయల బహుమతి నిస్తామనికూడా ప్రకటించింది, తెల్లదొరతనం ఆ రోజుల్లోనే. కానీ వారి ఆశలు అడియాసలుగానే మిగిలిపోయాయి. ఆయనజాడ అగోచరంగానే వుండిపోయింది. శ్రీ చరణ్ సింగ్ విప్లవభావాలకు, సమర పిపాసకు యిదొక నిదర్శనం మాత్రమే.

యం. యల్. ఏ :-

1937లో మొట్ట మొదటిసారిగా శ్రీ చరణ్‌సింగ్ ఛాత్రోలీ నియోజకవర్గంనుండి శాసనసభకు ఎన్నికయ్యాడు. అదినుండి అన్యాయానికీ, అక్రమానికీ వ్యతిరేకంగా పోరాడుతూ వచ్చిన శ్రీ చరణ్ "రైతు యాజమాన్యం లేక పనివారికి భూమి" అనే పుస్తకాన్ని 1934 జూన్ లోనే రచించాడు ఆ సంవత్సరం డిశెంబరులోనే కొంత కనిష్ఠ పరిమితికి లోబడి యున్న వ్యవసాయ కమతాలను విభజించ గూడదని ఓ పత్రాన్ని ప్రచురించాడు. అదే కాలంలో "భూ వినియోగ చట్టం" పేరుతో ఓ బిల్లును రూపొందించాడు. దాని ప్రకారం ఆచరణలో భూమిని దున్నుతూ, కౌలు దార్లుగా నున్నవారు, కౌలుకు పదిరెట్లు పైకాన్ని ప్రభుత్వ ఖజానాలో ఆ యజమాని పేర జమకడితే, ఆ భూమి కౌలుదారు సొంత మయ్యేట్లుగా పేర్కొన బడింది. ఆ మీదట ఉత్తరోత్తరా ఉత్తరప్రదేశ్‌లో వచ్చిన భూ సంస్కరణల చట్టానికిదే ప్రాతిపదికయ్యింది.

ప్రజాసేవా రంగంలో నున్నవారి జీవిత విలువలు, అభిప్రాయాలు ఆలోచనలు, తమను పరిపాలకులుగానూ, సంధాతలగానూ నిర్ణయించుకున్న వారి బాగోగుల కనుగుణంగా నుండడం మంచి ప్రభుత్వపు సుపరిపాలన

కవసరం గనుక దేశజనాభాలో అత్యధికంగా నున్న వ్యవసాయదార్ల పిల్లలకు ప్రభుత్వోద్యోగాల్లో కనీసం 60 శాతమన్నా కేటాయించ బడాలని, 1939 ఏప్రిల్‌లో కాంగ్రెసు కార్యవర్గంలో ఓ తీర్మానాన్ని ప్రవేశ పెట్టాడు. శ్రీ చరణ్. కానీ ఆ తీర్మానాన్నసలు పరిగణనలోనికే తీసుకొనలేదు. అంతటితో చప్పబడిపోక ఈ విషయాలన్నీ క్రోడీకరిస్తూ 1947లో ఓ సుదీర్ఘమైన వ్యాసాన్ని రచించి అప్పటి కాంగ్రెసు పెత్తందార్లందరికీ పంచాడు. అప్పట్లో ఆ పార్టీ పెత్తనమంతా వ్యవసాయేతర రంగంలోని వారికే పరిమితమై యుండేది. వారంతా ఈ వ్యాసంపై ఆగ్రహం చెందారు.

ఋణవిమోచన చట్టం :-

1939లో రుణ విమోచన చట్టానికి రూపు రేఖలుదిద్ది, తుది రూపానికి తెచ్చి వ్యవసాయ దారులకు ఊరట చేకూర్చాడు. వానిపై వచ్చిన పెక్కు విమర్శలకు సమాధానంగా 16 పేజీల వివరణాత్మక వ్యాసాన్ని రచించి, ఆగష్టులో నేషనల్ హెరాల్డు పత్రికలో ప్రచురించాడు. రైతాంగంపై ఎక్కడలేని ప్రేమ ఒలకబోస్తూ ప్రగల్భాలు పలికే కాంగ్రెసు సోషలిస్టుపార్టీ పెద్దలు, వివిధస్థాయీ సంఘాల్లోనూ, కమిటీలలోనూ రుణదాతల కనుకూలంగా చరణ్‌పై విరుచుకు పడడంచూసి విస్తుపోయాడు.

భూ సంస్కరణల్లో మొత్తం భారత దేశానికే ఒక వరవడిని ప్రవేశపెట్టింది ఉత్తర ప్రదేశ్. ఆ రాష్ట్రంలో జమీందారీ, భూస్వామ్య వ్యవస్థలు కూకటి వ్రేళ్ళతో పెకలించి వేయబడ్డాయి. రాష్ట్రమా-దేశంలో కల్లా విస్తృతమైనది. సమస్యలా - సంక్లిష్టమైనట్టివి. వాటినన్నింటినీ ఛేదించిన బృహత్తర కృషికి బాధ్యులు, అభినందనీయులు శ్రీ చరణ్. ఈ చట్టాన్ని రూపొందించడమేగాక, దానిలోని వివిధాంశాలపై అసంఖ్యాక వ్యాసాలను వ్రాశాడు. ఆకాశవాణి ద్వారా తన ఉపన్యాసాలవల్ల ప్రజలకు వివరించాడు. రాష్ట్రమంతటా వందలాది బహిరంగ సభలద్వారా, ఈ చట్టంలోని విశేషాలను ప్రజలకు సుబోధకం గావించాడు, ఈ చట్టం ఎంతటి

జాగరూకతతో, ఎంతటి దూరదృష్టితో రూపొందింప బడిందంటే-దానిలో ఒక్క భాగం, ఒక్క అంశంకూడా అపసవ్యంగా నున్నాయనలేక పోయాయి న్యాయస్థానాలు, మిగతా రాష్ట్రాల్లో మాదిరి.

జమీందారీ రద్దు చట్టం :-

1952 జూలై 1న ఉత్తరప్రదేశ్ పీఠభూమంతటా జమీందారీ రద్దు చట్టం అమలులోనికొచ్చింది. దాని ప్రకారం జమీందార్లుగానీ తదితర భూస్వాములుగానీ సొంతంగా వ్యవసాయం చేసుకొనే వారంతా భూమి దార్లుగా ప్రకటించబడ్డారు. వారు నివసిస్తున్న యిండ్లు, వారు సాగుచేసు కొంటూన్న భూమి, వాటిలోనున్న వృక్షజాలం- వినియోగదారు వీటన్నిం టినీ స్వేచ్ఛగా వాడుకొన వచ్చునన్నారు, ఆచరణలో అదేమాదిరి భూములు దున్నే కౌలుదార్లందర్నీ సిర్దార్లుగా పేర్కొన్నారు. అంటే భూమిదున్నే వారని నిర్వచనం. ఆ నేలను వారు పశుపక్ష్యాదులతో, తదితర విధాల పూర్తిగా వినియోగించుకొనే హక్కు వారికివ్వబడింది. అయితే బదలా యింపు మాత్రం, నిషిద్ధం ప్రభుత్వ ఖజానాలో, కౌలుకు పదిరెట్ల మొత్తం జమకట్టినవారిని, కౌలులోసగం తగ్గించి భూమిదార్ల స్థాయికి పెంచారు. ఈ విధానాన్నే భూమిధారీ విధానమన్నారు. జాతీయ ప్రణాళికా మండలి దీన్ని బహుధా ప్రశంసించి, మిగతా రాష్ట్రాలకు సిఫార్సు చేసింది అను సరణీయమని.

అదేమాదిరి జమీందార్లకు. భూస్వాములకు వారు పోగొట్టుకొన్న పొలం విలువతో పునరావాస ముదరా యివ్వబడింది, ప్రభుత్వ బాండ్ల రూపంలో అయితే వారు చెల్లించవలసిన శిస్తుల మొత్తాన్నిబట్టి, యిది తగ్గుతూంటుంది. దానితోపాటుగా, వీరు రుణదాతల కబంధ హస్తాలలో నలిగిపోకుండా. దాని నివారణకు మరో చట్టం తేబడింది. సిర్దార్లు, భూమి దార్లు చెల్లించే భూమిశిస్తులు రానున్న 40 సంవత్సరాల వరకూ పెంచడం జరగదనే హామీకూడా యివ్వబడింది, 1962లో అప్పటి ముఖ్యమంత్రి

50 శాతం చొప్పున భూమిశిస్తు పెంచజూస్తే, దాన్ని గట్టిగా ఎదిరించారు, శ్రీ చరణ్.

కౌలు షరతులేవైనా, వాటితో నిమిత్తం లేకుండా భూస్వాములు, కొంత పరిధివరకూ సొంత వ్యవసాయానికి తిరిగి స్వాధీనం చేసుకొనే అవకాశమున్నది. బొంబాయి, పంజాబ్‌లలో ఈ పరిధి 50 యకరాలు. హైద్రాబాదులో ఆర్థికంగా గిట్టుబాటయ్యే కమతాలకి 5 రెట్లుగా నున్నది. ప్రథమ పంచవర్ష ప్రణాళికలో, ఈ తిరిగి స్వాధీనం చేసుకొనే విధానాన్ని సూత్రప్రాయంగా అంగీకరించి, ఈ పరిధిని కుటుంబ పరిమితికి 3 రెట్లకు లొబడి వుండాలని నిర్ణయించారు. దానితో తెల్లదొరల పరిపాలనా కాలం నుండి వంశపారం పర్యంగా కౌలు అనుభవించేవారు కూడా భూమినుండి తొలగించి వేయబడ్డారు. కానీ చరణ్ దీని కంగీకరించలేదు. ఒక్క కౌలు దారునికూడా భూమినుండి తొలగించబడ డానికిష్టపడలేదు అంతేగాక ఈ అన్యాయాన్నుండి వారిని రక్షించేందుకై 1954లో ఈ చట్టానికి తేబడ్డ సవరణద్వారా కౌలుదార్లకేగాక. ఉపకౌలుదార్లకు, జమీందార్ల వద్దనున్న పాలెగాళ్ళకుకూడా శాశ్వత కౌలుదారీ రక్షణ యివ్వబడింది. దీన్ని అప్పటి కాంగ్రెసు పెత్తందార్లందరూ ఎదిరించినా, దాన్నాపలేకపోయారు. దానితో వీరంతా జమీందారీ రద్దువల్ల రెవెన్యూ రికార్డుల్లో అధివాసీలుగా మారి పోయారు. వీరికి 194 ,'48 చట్టాలవల్ల భూములనుండి తొలగించి వేయ బడకుండా రక్షణ చేకూరింది. ఈ సవరణ ద్వారా, ఈ అధివాసీల్లో 3వ వంతు, అంటే మొత్తం రాష్ట్రంలో 30 లక్షలమంది హరిజనులకు ప్రయో జనం, వనగూడింది.

సిర్దారులు లేక ఐచ్ఛిక కౌలుదార్లు-వీరంతా మొత్తంగా షెడ్యూల్డు కులాలవారే వీరందరూ సిర్దార్లుగా మారారు, ఆ ప్రాంతంలో నున్న పెత్తందార్లకిది మ్రింగుడు పడని విషయం దీన్ని చట్టబద్ధం చేసేందుకై 1954లో ఓ బిల్లు ప్రవేశ పెట్టబడింది, దాన్ని సెలక్టు కమిటీకి పంపారు. ఆకమిటీ నివేదిక ఆ మార్చిలో శ్రీ చరణ్ రాజీనామా యివ్వక ముందే అందింది.

1952లో జమీందారీ రద్దు చట్టం చేయబడగానే, దొరతనం వారికి పెక్కు ఫిర్యాదులందాయి. అధివాసీలని చెప్పబడేవారిలో హెచ్చుమందసలు రెవెన్యూ రికార్డులో ఎక్కి నమోదే కాలేదని, ఒకవేళ కొద్దిమంది నమోదైనా, మోసంతోగానీ లేక బలవంతంగా గానీ భూమినుండి తొలగించి వేయబడుతూన్నారనీ తేలింది దాని నివారణకై రెండు చర్యలవసరమయ్యాయి. అందులో మొదటిది జమీందారీ రద్దు చట్టంలోని 342వ సెక్షను క్రింద ఈ చట్టంవల్ల అధికారం కోల్పోయిన అధివాసీలు తిరిగి తమ భూమిని పొందడానికి గడువును అర్ధ సంవత్సరం నుండి సంవత్సరానికి పెంచడం. 1952 నవంబరులో జమీందారీ రద్దు చట్టానికి తేబడ్డ అనుబంధ చట్టం ద్వారా, రెవెన్యూ డివిజనల్ అధికారి లేక తహశీల్దారు విచారణ జరిపి అక్కడి కక్కడే ఎవరినైనా ఈ చట్టం ద్వారా భూమినుండి తొలగించబడిన వారిని, రెవెన్యూ రికార్డులో చేర్చడాని కధికార మివ్వబడింది.

ఆయా జమీందారీ గ్రామాల్లోనున్న రైతాంగం కౌలుదార్లైనా లేక చేతి వృత్తులవారైనా లేక యితరేతర నివాసులైనా వారి వారి పొలాలు, గట్రా, కొంపా, గోడలన్నింటిపై హక్కులు దఖలు పర్చబడ్డాయి. దానికి వారే విధమైన మూల్యం చెల్లించవలసిన పనిలేదు. అప్పటి వరకూ ఆయా జమీందార్ల యిష్టాయిష్టాలపై ఆధారపడి యిండ్లలో వుండడం, పొలం దున్నుకొనడం అక్కడనుండి తొలగించబడటం జరుగుతూండేది. ఈ సంస్కరణవల్ల కూడా హెచ్చుగా లాభించింది హరిజనులే. ప్రజానీకం నివసించే యిండ్లు. సాగుచేసుకొనే వ్యవసాయ కమతాలు పోనూ మిగిలిన సాగుకు లాయకీఅయిన యావత్తు నేలను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, దాని యాజమాన్యాన్ని పంచాయితీల కప్పజెప్పింది, దీనికొరకై గ్రామ సమాజాన్ని గూర్చి పంచాయితీల విధులను పొందుపరుస్తూ శ్రీ చరణ్ వెలువరించిన వివరణ గ్రంథం మిగతా రాష్ట్రాలకు కూడా ఆదర్శ ప్రాయమైంది.

పెకలించి వేయబడ్డ ఫ్యూడల్ వ్యవస్థ :-

ఆ రకంగా ఒక వ్యక్తిని మరొక వ్యక్తితో బంధించిన ఫ్యూడల్ వ్యవస్థ సమూలంగా పెకలించి వేయబడింది. ఆ రాష్ట్రంలో, దోపిడీ అంతరించిపోయింది, యింటికి. పొలానికి, నీరుకి, నూతికి, చెట్టుకి, చేమకూ, పల్లెసీమల్లో ఎవరో మరొకరి మీద ఆధారపడి బ్రతికే దురవస్థ రద్దయిపోయింది. ఆ విధంగా ఉత్తర ప్రదేశ్ రాష్ట్రమంతటా పల్లె ప్రాంతాలన్నింటా జమీందారు- రైతు- భూస్వామి వంటి అంతరాలే ఆనవాలుకు కూడా మిగలకుండా అంతరించి పోయాయి.

చట్టంలోని ప్రతి అక్షరమూ ఆచరణలోని కొచ్చింది. ప్రతి ప్రభుత్వా దేశం, ప్రతి ఒక్క తాఖీదు జిల్లాల కందేట్లు, దానికి ముందు అది క్షుణ్ణంగా తన సమక్షంలో చర్చించబడేట్లు చూశాడు. శ్రీ చరణ్. రాష్ట్రంలో ఏ మూరు మూలనైన సరే ఎంతటి బలహీనుడైనా సరే భూమి నుండి తొలగించబడు తూన్నాడంటే చాలు- దాన్ని నివారించడానికి రెవెన్యూశాఖ పరుగులెత్తేది- ఆ నిస్సహాయుని కండనిల్చేది.

ఉత్తర ప్రదేశ్ తూర్పు జిల్లాల్లో శోషిత్ సంఘమనే దొకటుండేది అది వెనుకబడిన. హరి. నల్లో అతివాదంతో, అతి శీఘ్రంగా పెంపొందజొచ్చింది ఉపకౌలుదార్లకు రక్షణ కలుగజేయాలని, వారు కేకలు మొదలు పెట్టారు. 1950 ఏప్రిల్ మాసంలో అలహాబాదు జిల్లా గ్రామీణ ప్రాంతానొక బహిరంగ సభలో మాట్లాడుతూ భూ ఆక్రమణదార్లతోసహా తదితర అధివాసీ లందరినీ సిర్తారుగా గుర్తించి, వారు సాగుచేసు కొంటూన్న భూమిపై హక్కును రఖలు వచ్చడానికి కాంగ్రెసు సిద్ధంగా నున్నదని ప్రకటించాడు. శ్రీ చరణ్ దానితో విద్యుత్ సరఫరా నిలిచిపోగానే దీపాలు ఆరిపోయినట్లు శోషిత సంఘం మాయమై పోయింది కానీ దానికి వారు ఈర్ష్యపడలేదు. కోపగించు కొనలేదు. భూ సంస్కరణల చట్టంలోని విప్లవాత్మకతకు ప్రభావితులై వారంతా కాంగ్రెసులో చేరారు. అప్పటివరకూ ఆ ప్రాంతాన కాంగ్రెసులో పెత్తనం చెలాయిస్తూన్న పెద్ద కులాల వారికిది కంటక ప్రాయమయ్యింది.

ఈ జమీందారీ రద్దు చట్టాలవల్ల, భూ సంస్కరణల చట్టాలవల్ల వనగూడిన ప్రయోజనాలను పదిలపర్చడానికై, భవిష్యత్తులో భూమి దార్లలోగానీ లేక సిర్దార్లలోగానీ శారీరక సౌష్టవం, మానసిక దారుఢ్యం వున్నవారెవరైనా తమ పొలాన్ని మరొకరికి బదలాయించడమంటే, దానిమీద వారికున్న హక్కు అంతరించి పోతుందని చట్టం చేశాడు. తద్వారా తిరిగి భూస్వామ్య వ్యవస్థ పునః స్థాపితం కాకుండా ఆపగలిగాడు అంతేగాక రానున్న కాలంలో భూమి కొద్దిమంది చేతుల్లోనే పరిమితమై పోకుండా వారి భార్య, మైనరుపిల్లలతోసహా, ఏ ఒక్కరూ $12\frac{1}{2}$ యకరాలు లేక 20 భీగాలకుమించి భూమిని వుంచుకొన రాదనే చట్టాన్నొకదాన్ని ప్రవేశపెటాడు. శ్రీ చరణ్. యింకా 3, 125 యకరాలు లేక 5 భీగాలకు లోబడియున్న భూమి పంపకం కావాలని న్యాయస్థానంలో వివాదంవస్తే దాన్ని మొత్తంగా అమ్మివేసి, ఆ పైకాన్ని వాటాదార్లకు పంచాలేగాని, ఆ చిన్న కమతాన్ని, విడదీయ రాదన్నాడు.

వ్యవసాయదార్లు నివసిస్తూన్న యిండ్లను ద్రవ్య లావాదేవీల్లో జప్తు చెయ్యకూడదని నిబంధనున్నది దేశమంతటా, సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని 60వ సెక్షను ప్రకారం. అయితే ఉత్తర ప్రదేశ్‌లో, తనఖా పెట్టిన సందర్భంలో కూడా, ఈ యిండ్లను డిగ్రీనుండి మినహాయించడం జరిగింది.

1948–'49లో శ్రీ చరణ్ ఓ చట్టం తెచ్చాడు. దాని ప్రకారం ఓ కర్మాగారానికి గానీ లేక విద్యాలయానికిగానీ తప్పనిసరిగా భూమి స్వాధీనం చేసుకొనడం అవసరమయితే, ఆ స్థలం నుండి అరమైలు పరిధి లోపల సాగులోలేని నేల అందుబాటులో నున్నట్లయితే, సాగులోనున్న భూమిని స్వాధీనం చేసుకొన గూడదన్నాడు. దీనికి 15 సంవత్సరాలగ్గాని, ఈ విధమైన భూ స్వాధీన చట్టం తేలేక పోయింది, కేంద్ర ప్రభుత్వం.

ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో, అందునా ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో జార్-ఇ-ఛాహ్రమ్ అనే ఓ ఆచారం వున్నది. దాని

ప్రకారం ఓ భవంతిలో అద్దెకుంటున్నవారు. దాని ఆసామి దాన్నమ్మ కొన్నప్పుడు, దానిలో 4వ వంతు పైకాన్ని పొందేవారు. యిది లేని పోని తగాయిదాలకు, వ్యాజ్యాలకు అవకాశమిస్తూండడాన, దాన్ని రద్దు చేశాడు శ్రీ చరణ్.

పేదలకు భూమి :-

జమీందారీ రద్దు చట్టంలోని 198వ సెక్షను ప్రకారం– గుర్తించబడ్డ విద్యా సంస్థల తర్వాత– ఆ గ్రామంలోని భూ వసతిలేని పేదలకు– భూ యాజమాన్య సంఘంవారు ప్రాధాన్యత నివ్వాలని చట్టం చేయబడింది. షెడ్యూల్డు కులాలవారి కయితే, ఆ భూమి మూల్యం లేకుండానే దాఖలు పర్చబడుతుంది. అదే యితరేతర కులాలవారి కయితే కౌలుకు పదిరెట్ల మొత్తాన్ని చెల్లిస్తే సరిపోతుందన్నాడు, శ్రీ చరణ్– ఈ చట్టాలవల్ల ఉత్తరప్రదేశ్ అంతటా, భూ కమతాలు పటిష్ఠమయ్యాయి. ఏ మాత్రం జాప్యం లేకుండా ప్రభుత్వ సిబ్బందిని– నూతన చట్టాలకీ, మారిన పరిస్థితులకీ అనుగుణ్యంగా తర్ఫీదు నిప్పించాడు. కించిత్తు కాలహరణం కూడా లేకుండా, శీఘ్రమే ఆ చట్టాలను ఆ చరణలోనికి తేవాలని ఆదేశించాడు. ఈ చట్టాలను తేవడంవల్ల ప్రభుత్వానికీ, పార్టీకీకూడా చెడ్డపేరు రాగలదని సోషలిస్టులేగాక, తన సొంత వర్గంలోని వారుకూడా వ్యతిరేకించారు. దానికి విసుగు చెందిన శ్రీ చరణ్ రాజీనామా చేశాడు, ఆయన తర్వాత రెవెన్యూ మంత్రిగా వచ్చిన శ్రీ ఠాకూర్ హుకుంసింగ్, వారం తిరగక ముందే, ఈ చట్టాల ఆచరణను రద్దుచేశాడు. ఈ అనూహిత చర్యకు వ్యతిరేకంగా రైతాంగం ఆందోళన చేపట్టింది. ప్రణాళికా సంఘంవారు కూడా, వీటి ఆచరణకై పట్టుబట్టారు. దానితో నెల తిరగక ముందే, మళ్ళీ ఆ చట్టాలను, వాటి ఆచరణను తిరిగి చేపట్టారు. శ్రీ చరణ్ దూరదృష్టికిదొక ఉదాహరణ.

194[illegible]లో వచ్చిన వ్యవసాయ పన్నుల చట్టాన్ని శ్రీ చరణ్ రద్దుచేశాడు. 1952 జమీందారీ రద్దు చట్టంతో, పెద్ద భూస్వాములు లేకుండా

పోవడాన ఈ చట్టం నిరర్ధకమై కేవలం లంచగొండి తనానికి, అవినీతికి ఆలవాలంగా మిగిలివున్నది, దీనికి మారుగా భారీ భూకమతాలపై పన్ను చట్టాన్ని ప్రవేశపెట్టి రైతాంగాన్ని ఉద్యోగస్తుల యిబ్బంది నుండి రక్షించాడు. ఈ కొత్త చట్టంవల్ల పెద్ద రైతులు తమ ఆదాయాన్ని దాచడానికి, పన్ను ఎగవేయడానికి, లంచగొండితనానికి చోటులేకుండా పోయింది. దానితో పాటుగా భూ పరిమితి పెరిగిన కొద్దీ, పన్ను మరింత పెరుగుతూండడంతో, హెచ్చుభూమి కలిగియుండడానికి భయపడ్డారు జనం. తద్వారా కొంత సాంఘిక న్యాయంకూడా చేకూరింది.

1959లో శ్రీ చరణ్ రాజీనామా చేసిన తర్వాత, ఈ చట్టం స్థానంలో భూ పరిమితి విధింపు చట్టం తేబడింది. దీనివల్ల భూమిలేని పేదలకు పంచేదానికి నామ మాత్రం నేల వచ్చేట్లు చేశారు పెద్ద భూస్వాములు వారికున్న భూమిని వారి బంధువుల్లోనే బినామీ బదలీలు చేసుకొనేట్లుగా వారికి కావలసినంత వ్యవధిని, అవకాశాన్ని యివ్వడం జరిగింది. ఈ అసమర్ధచర్యవల్ల దొరతనం వారి కొచ్చింది, నామ మాత్రం భూమి. దానికూడా పెద్ద మొత్తంలో జనం డబ్బు, వృధా.

కరణాల బెదిరింపులు :-

జమీందారీ రద్దు చట్టం రూపొందింది. అది అమలు జరిగే దశలో గ్రామ పట్వారీలు లేక కరణాలు 28 వేలమంది, తమ జీతాలు, సౌకర్యాలు పెరగాలని సమ్మె చేపట్టారు. రెవెన్యూ శాఖలో వీరంతా చాలా కీలకమైన, ప్రధాన పాత్రధారులు. ఒక నెల ఓపికపడితే, వారి సమస్యల నన్నింటినీ పరిష్కరిస్తానని సలహా యిచ్చాడు శ్రీ చరణ్. ఆ సలహాను పెడచెవిని పెట్టి, 1953 జనవరిలో మూకుమ్మడిగా రాజీనామా చేశారు. దానితో రెవెన్యూ వసూళ్ళు స్థంభించిపోయి, వారడిగిన దానికల్లా దొరతనం ఒప్పుకొనక తప్పదని, వారి ఊహ. దానికి బెదరని శ్రీ చరణ్ వారి రాజీనామాలన్నీ ఆమోదించి వారి స్థానంలో లేఖపాల్‌లను నియమించాడు, తక్కువ జీతంతో, తక్కువ సౌకర్యాలతో. దీనిపై కాంగ్రెసు దొరతనంలో తీవ్ర

మైన వ్యతిరేకత ఎదురైనా, శ్రీ చరణ్ చలించలేదు. ఈ ఒక్క సందర్భంలో నిబ్బరంగా వుంటే, రానున్న పది సంవత్సరాల వరకూ ప్రభుత్వోద్యోగులు బెదిరించడంగానీ, సమ్మెలకు దిగడంగానీ వుండదని, శ్రీచరణ్ వాదం. ఆపట్టు పదేళ్ళగాదు, పదమూడేళ్ళన్నది తిరిగి 1966లో శ్రీమతి సుచేతా కృపాలనీ ముఖ్యమంత్రిగా నున్నప్పుడుగాని ప్రభుత్వోద్యోగులు 9 వారాలపాటు సమ్మెచేసి, పాలనా యంత్రాంగాన్ని స్తంభింప జేయడానికి సాహసించలేదు. అప్పుడుకూడా కాస్త కరుకుగా వ్యవహరించమని చెప్పిన శ్రీ చరణ్ సలహాను, రాజకీయ కారణాలతో త్రోసిపుచ్చారు.

జమీందారీ రద్దువల్ల మిలియన్ల మందికి ముదరా యివ్వవలసి వచ్చింది పంచవలసిన మొత్తం పైకం రూ 200 కోట్లకు పైబడి యున్నది, భూమి శిస్తులను కొత్తగా బేరీజు వేయవలసి వచ్చింది. యిదంతా ఓ సంక్లిష్టమైన సమస్య. ఈ యావత్తు వ్యవహారాన్ని అతి శీఘ్రకాలంలో నిర్ధారించే యంత్రాంగాన్ని రూపొందించి, యిదివరకెన్నడూ లేనంతటి అతి తక్కువ సమయంలో తేల్చివేశాడు. శ్రీ చరణ్. భూమి శిస్తు వసూళ్ళను అతి చౌకగా, సకాలంలో పూర్తయ్యే పద్ధతిని కూడా ప్రవేశపెట్టాడు. మారిన పరిస్థితుల కనుగుణ్యంగా భూమి రికార్డుల మాన్యుయల్‌ను కూడా మార్చాడు. కొన్ని కొత్త తాలూకాలను రూపొందించాడు. శతాబ్దాల తరబడి ఆయాజిల్లాలో చిక్కుకొని పాలనా సౌలభ్యాని కనువుగాలేని ప్రాంతాల్ని పునః వ్యవస్థీకరించాడు.

నాగపూర్ కాంగ్రెసు :-

1959 జనవరి నాగపూర్ అఖిలభారత కాంగ్రెసు సమావేశం. సహకార వ్యవసాయం, ప్రభుత్వ రంగాన ఆహార ధాన్యాల వాణిజ్యం- పండిట్ నెహ్రూ ఊహా సౌధాలు. దాన్ని తీవ్రంగా, సమర్థంగా ఎదుర్కొన్నాడు, శ్రీ చరణ్. భూశక్తిని, కర్షక శక్తినీ కూడదీయడం అధికోత్పత్తికి తోడ్పడకపోగా, మీదు మిక్కిలి ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు ప్రమాద భరితమని శ్రీ చరణ్ వాదం. దీనివల్ల దిగుబడి తగ్గడం,

ప్రజాధనం దుర్వినియోగం కావడంవంటి అనర్థాలు కూడా వాటిల్ల గలవని, హెచ్చరించాడు. శ్రీ చరణ్‌లోని ఈ దృఢ విశ్వాసమే 1959లో కాంగ్రెసు నుండి రాజీనామా చేయించింది.

1959లో శ్రీ చరణ్ ప్రభుత్వా న్నొదిలిన నాటినుండి భూ సంస్కరణలు, ఎక్కడవేసిన గొంగళి అక్కడిగానే మిగిలిపోయాయి ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం మొత్తంలో తరాయి, భాభార్ ప్రాంతాల్లో తగినంత వ్యవధి లేకపోవడాన జమీందారీ రద్దు చట్టాన్ని అమలు పర్చలేకపోయాడు. ఆ తర్వాత ఎందరో ముఖ్యమంత్రులొచ్చారు. యింకెందరో రెవెన్యూ మంత్రులయ్యారు కానీ ఈ కొస్త పనీ పూర్తి చేయలేకపోయారు. వారికా సమస్యను గూర్చిన అవగాహన, చేద్దామనే ఆలోచన, చేయగల ధీశక్తి వుంటే గదా!

పెద్ద పెద్ద మహానగరాల్లోను, పట్టణాల్లోనూ యున్న స్థలాల్లో యిండ్లు వేసుకొని నివసిస్తున్న వారికి, వాటిపై హక్కులుండాలని శ్రీ చరణ్ వాదం. ఆ యిల్లు సొంతంగా వేసుకొన్నదైనా, ఆ స్థలం ఆసామీ అవకాశం చిక్కినప్పుడల్లా, ఆ నివాసితులను వెళ్ళగొట్టాలని చూడడం, పరిపాటి. అది వీలుకాకపోతే, ఆ నేలకు అద్దె పెంచడం, రివాజు. దీన్ని నివారించాలని శ్రీ చరణ్ పట్టుదల. కానీ 1959లో రాజీనామాచేసిన తర్వాత తిరిగి రెవెన్యూశాఖ తన చేతికి రాకపోవడంతో, ఆపని చేయలేక పోయాడు.

1963లో శ్రీ ఉల్ఫ్‌లాడ్జిన్స్కి ఫోర్డు ఫౌండేషన్ తరఫున భూ సంస్కరణలపై ప్రణాళికా సంఘంవారికొక నివేదికను సమర్పించాడు. దానిలో "ఈ చట్టం రూపొందిన దశాబ్దంన్నర తర్వాత అలీఘడ్ జిల్లాను పరిశీలించాం. దీని అమలును గూర్చి ఒక్క సిర్దార్ల విషయంలో మినహా మరిదేనిలోనూ ఈ చట్టానికి జోడించవలసిందీ, తొలగించ వలసిందీ-కించిత్తు కూడాలేదు. ఒక్క ఉత్తరప్రదేశ్ మినహా మిగతా భారతదేశ మంతటా భూసంస్కరణ చట్టాలు ప్రసవం కాకుండానే పిండం కన్ను

మూసిన మాదిరిగా మిగిలి పోయాయి. దీనినుండి గ్రహించ వలసిన గుణపాఠం ఒక్కటే. చేద్దామనే మనస్సుంటే—— చేయడానికి మార్గం లేక పోలేదని, మాత్రమే. మేము పర్యటించిన పల్లె ప్రాంతాలంతటా యిది స్పష్టంగా కనబడింది." 1954 సెప్టెంబరు- 9న టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలో ఆయన వ్రాసిన వ్యాసంలో "దేశంలోకల్లా పెద్దది. హెచ్చు జనాభా కలదియయిన ఉత్తర ప్రదేశ్‌లోనే ఈ భూసంస్కరణల నమలు పర్చడం సుసాధ్యమయి నప్పుడు, మిగతా రాష్ట్రాల్లో అమలు జరగక పోవడం, కేవలం అమలు పర్చవలసిన వారికిది యిష్టం లేకనే" నన్నాడు.

భూ సంస్కరణలు :-

భూ సంస్కరణల అమలులో శ్రీ చరణ్ విశ్వాసం అంచంచలం. దీని సాధనకై ఆయనకృషి అపారం. తెల్లదొరల నాటినుండి, ఈ సంస్కరణలకై, ఈ చట్టాల సాఫల్యతకై కార్యకర్త లెంతగా ఉత్సుకత ప్రదర్శించినా, నాయకులు వేదికలపై ప్రగల్భాలు పలికినా, అమలులో వీటి కడ్డుపడింది కాంగ్రెసు నాయకత్వమే. వారి అభిరుచులకు ఈ చట్టాల నమలు చేయడంవల్ల దెబ్బతగులుతుందని, ఈ కాంగ్రెసు పెత్తందార్లు సమాజంలో అట్టడుగు నున్నవారి అభ్యున్నతికి. గొడ్డలి పెట్టయినా సరే, ఆ చట్టాలను ఎదిరించక మానలేదు. తన కృషికి, తన సహచరులనుండి అభినందనలుగాక, శ్రీ చరణ్ ఖండన, మండనల నెదుర్కొనక తప్పలేదు.

ఉత్తరప్రదేశ్‌లో, అందునా తూర్పుజిల్లాలలో రాజకీయ నాయకత్వం యావత్తూ కార్యకర్తలు అంతా పెద్ద కులాలవారే. వారి వ్యవసాయమంతా వెనుకబడిన తరగతులవారు కౌలుకిచ్చేస్తూంటారు. శ్రీ చరణ్ చేసిన చట్టాలు తమ అభిరుచులకు అరిష్టదాయకమని, పై నాయకత్వం వాటి నెదిరించింది. యిలా ఎదిరించడంలో కాంగ్రెసు నాయకులైనా లేక సోషలిస్టు నాయకులైనా వెనుకంజ వేసింది, వెరసిందిలేదు,

ఉత్తరప్రదేశ్‌లో భూ సంస్కరణల చట్టం. సాంఘిక న్యాయాన్ని

సాధించడమేగాక, ప్రజాస్వామ్య మనుగడ కదొక బలమైన పునాదిగా నిలి చింది, అందువల్లనే పండిట్ పంత్ కేంద్రప్రభుత్వాని కెళ్ళిపోవడంతో, ఆరాష్ట్రంలో పాలనా సౌష్టవం దెబ్బతిన్నా కూడా, అక్కడ కమ్యూనిజం ప్రవేశ్యాన లేకపోయింది.

చరిత్ర గమనాన్ని గ్రహించి గుణపాఠాలు నేర్చుకొనకపోగా, దశాబ్దం గడిచినాక కూడా ఈ చట్టాలను నీళ్ళు గార్చయత్నించారు కాంగ్రెసు పెత్తందార్లు. 1965-'66లోనే రెండు చట్టాలను తేవాలని చూశారు. సర్కారు భూమిదార్లు తమ హక్కులోనున్న పొలాన్ని తిరిగి కౌలుకిచ్చే హక్కును దాఖలు పరుస్తూ ఒక ప్రతిపాదన- 12½ యకరాలకు మించికూడా పొలం కలిగియుండ వచ్చునే ప్రతిపాదనం రెండవది. ఈ రెండు ప్రతిపాదనలనూ శ్రీ చరణ్ తీవ్రంగా ఎదుర్కొనడంతో, అవి చట్ట రూపం దాల్చలేక పోయాయి.

పైన పేర్కొన్న చట్టాలతో బాటుగా వ్యవసాయాభి వృద్ధికీ, వ్యవసాయ దిగుబడులు పెంపొందడానికీ శ్రీ చరణ్ 1954లో భూసాంద్ర పరిరక్షణ చట్టాన్ని రూపొందించాడు. దీని కొరకై కాన్పూర్ ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో రెండేండ్ల పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సును ప్రవేశపెట్టాడు. 1954 చట్టానికి 1961లో సవరణతెచ్చి భూసార మరియు జలసాంద్ర పరిరక్షణ చట్టంగా పొందుపర్చాడు. ఆ చట్టం వ్యవసాయ రంగంలోనేగాక, రాజకీయ రంగంలోకూడా తన విరోధుల మన్ననలను పొందింది. 1954లో శ్రీ సంపూర్ణానంద్ ముఖ్యమంత్రి గావడంతో శ్రీ చరణ్ నుండి వ్యవసాయశాఖను మరొకరికి బదలాయించారు ఆ కొత్త మంత్రికి ఈ చట్టాని కవసరమైన నిబంధనలను రూపొందించ డానికి నాలుగేళ్ళు పట్టింది.

ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో నున్న భూసార పరీక్షా కేంద్రాల పథకం శ్రీ చరణ్ రూపొందించిందే. ప్రభుత్వ యంత్రాంగానికి సహాయ కారిగా ప్రభుత్వేతర వ్యవసాయ కళాశాలల వనరులనుకూడా దీనికి జోడించాడు శ్రీ చరణ్. 1963 వరకూ వ్యవసాయావసరాల్లు సహకార

సంఘాల్లో సభ్యులుగానున్న 40 శాతం పెద్ద రైతాంగానికి మాత్రమే పరిమితమై వుండేవి. మిగిలిన 60 శాతం సన్నకారు రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ పరికరాలు, అప్పులు అందించేందుకై వ్యవసాయావసరాల సరఫరా సంస్థను నెలకొల్పాడు, శ్రీ చరణ్.

వ్యవసాయరంగ ప్రాముఖ్యం :-

1958 నుండీ శ్రీ చరణ్ శాసనసభలోనూ, వెలుపలాకూడా వ్యవసాయం అభివృద్ధి చెందనిదే, వ్యవసాయేతర రంగంకూడా బాగుపడదని వాక్రుచ్చుతూనే యున్నాడు. వ్యవసాయాభివృద్ధి లేనిదే జాతి ఆర్థికంగా ప్రగతి పథాన పయనించదని శ్రీ చరణ్ ప్రబల విశ్వాసం. ఆయన వాదనను వినిపించుకొన్న నాధుడేలేడు. బలీయమైన వ్యవసాయ రంగమే-

1. పరిశ్రమల చక్రాలు తిరగడానికవసరమైన ముడి సరుకలనందించేది.
2. పరిశ్రమలకు, వాణిజ్యానికి, రవాణా, విద్యుదుత్పత్తి, రోడ్లు, రైళ్ళు, నౌకాశ్రయాలు వంటి వాటికవసరమైన మానవశక్తి నందించేది.
3. ద్వితీయ, తృతీయ రంగాల్లోని వివిధ విభాగాల్లో పనిచేసే కార్మికులకు తిండి నందించేది.
4. వ్యవసాయ దిగుబడులు, వాటిధరలు పెరిగిన కొద్దీ రైతాంగం కొనుగోలుశక్తి పెరిగి, వ్యవసాయేతర వస్తువులకు గిరాకీని పెంచేది.
5 అవసరమైన వ్యవసాయేతర యాంత్రిక సామాగ్రి దిగుమతి కవసరమైన విదేశీ మారక ద్రవ్యాన్ని చేకూర్చి పెట్టేది అందువల్ల వ్యవసాయాభివృద్ధి అత్యవసరం, అభిలషణీయం-అని శ్రీ చరణ్ వాదం.

ప్రజానీకంలో నైతికశక్తి, శ్రమశక్తి పెంపొందకుండా ఆర్థికాభివృద్ధి, జాతిపురోభివృద్ధి సాధ్యంగాదని శ్రీ చరణ్ విశ్వాసం. జపాన్

సాధించిన ప్రగతిని పరిగణన లోనికి తీసుకొని పరిశీలిస్తే భౌతిక వనర్ల కన్నాకూడా, మానవ శ్రమశక్తి, ప్రజానైజం ప్రధానమని రుజువవుతుంది. ప్రపంచం జీవితం కేవలం మిధ్యా మాత్రమేనని గ్రుడ్డిగా నమ్ముతూ, శ్రమైక జీవనసౌందర్యాన్ని ఆస్వాదించలేక పోతున్నారు మన జనం. పైన ఎవరో అజమాయిషీచేసి, చెవిమెలివేస్తూంటేగాని మనకు మన పని చేయడం అలవాటుగాదు. నిర్వర్తించ వలసిన బాధ్యతలను పూర్తిగా విస్మరించి, నిరంతరం హక్కుల సాధనకై పోరాటం, మన జనానికీ మానసిక నైజం మారనిదే, విద్యుత్తు! పెట్టుబడి, ఉక్కు, సిమ్మెంటు, తదితర సమస్త వసుజాలం ఎంతగా ఉత్పత్తి చేయగలిగినా వసగూడే ప్రయోజనం పరిమితమైనదే. అందువల్ల మనవారి నైజాన్ని మార్చాలి. అందు కవసరమైన విద్యాబోధన గరపాలి. దాని కవసరమైన శ్రద్ధ వహించాలి, ప్రణాళికా సంఘంవారు ఈ విషయాలన్నీ వివరిస్తూ శ్రీ చరణ్ పెక్కు పర్యాయాలు పండిట్ జవహర్లాల్‌కు, తదితర బాధ్యతా యుత పెద్దలకు పదే, పదే వ్రాశాడు. కానీ ఆ సలహాలన్నీ చెవిటిముందు శంఖం ఊదినట్లుగా వృథాగా మిగిలిపోయాయి.

రైతులనుండి ప్రొక్యూర్‌మెంటు లెవీని వసూలు చేస్తున్నప్పుడు, ఆహార మండలా లుండగూడదని శ్రీ చరణ్ 1·61 నుండి వాదిస్తున్నాడు. ఆహార ధాన్యాల కొరతయున్న ప్రాంతాలకు, ప్రొక్యూర్ చేసిన ధాన్యాన్ని సరఫరా చేయవచ్చుని, యింకా అవసరం తీరకపోతే దిగుమతుల ద్వారా ఆ యిబ్బందిని ఎదుర్కొన వచ్చుని, శ్రీ చరణ్ వాదం 1966లో నిపుణుల సంఘం ఈ ఆహార మండలాల రద్దుకై సిఫార్సు చేసినా, అలా రద్దుచేసే ధైర్యం కేంద్రానికి లేకపోయింది. దానితో, తమ రైతులనధిక దిగుబడులను సాధించమని అడిగే మానసిక ధైర్యం, నైతిక బలం రాష్ట్ర ప్రభుత్వాలకు అసలే లేకుండా పోయింది.

పంటల భీమా పథకం రాబోతూన్నట్లుగా వార్తల్లో వస్తూన్న దాన్నిబట్టి, అది ఆచరణ సాధ్యం కాని పథకమని 1965 అక్టోబరులో

అప్పటి ప్రధాని శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రికి వ్రాశాడు. శ్రీ చరణ్. కానీ కేవలం 967 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, 1966 మే లో బొంబాయి అఖిలభారత కాంగ్రెస్ సమావేశంలో ఆ పథకాన్నామోదించారు. ఎన్నికలగాండికై ఆవాస్తవిక పథకాల వెంట పరుగులెత్తడం, అభిలషణీయం గాదని హెచ్చరించాడు. శ్రీ చరణ్.

మనజాతి అభివృద్ధి రైతుల పురోగతి మీదనే ఆధారపడి యున్నదని విశ్వసించి 1964 జనవరిలో దానికొరకై 'కృషిక్‌సమాజ్'ను స్థాపించి దాని కధ్యక్షుడయ్యాడు. యిదొక అఖిల భారత రాజకీయేతర సంస్థ. దీనిలో ఎన్నికలులేవు. వ్యవసాయ శాఖలోని అధికారులు ఈ సంస్థలో ఎక్సె అఫీషియో సభ్యులు. వ్యవసాయంలో అధునాతన పద్ధతులను రైతులకు నేర్పడం, వనరులను సమకూర్చు కొనడంలో సహాకరించడం, ప్రభుత్వ పథకాలను పరిచయం గావించడం, వారి అభివృద్ధికై పథకాలు, ఆలోచనలు చేయడం, తదితర సాంఘిక ఆర్థిక పురోగతికి తగిన సోపానాలు వేయడం, ఈ సంఘం లక్ష్యాలు. శ్రీ చరణ్‌కు ప్రజల్లోగల పలుకుబడిని చూసి ఓర్వలేని ప్రతికక్షులు, అప్పటి ముఖ్యమంత్రి శ్రీమతి సుచేతా కృపాలనీతో ఓతాఖీదు జారీ చేయించారు. ఈ రకంగా రెండేళ్ళయినా పనిచేయక ముందే, అదీ తన మంత్రి వర్గంలో సీనియర్ సహచరుడైన శ్రీ చరణ్‌ను సంప్రదించకుండానే, పై సంఘంలో ప్రభుత్వాధికార్లు పాల్గొన గూడదని ఉత్తర్వు జారీ అయ్యింది.

పశుగణాభివృద్ధి :-

పశుగణాభివృద్ధి విషయంలోకూడా శ్రీ చరణ్ కృషి తక్కువైనదేమీకాదు. పశువుల అక్రమణ చట్టానికి చేసిన సవరణ, 1954 ఉత్తర ప్రదేశ్ గోవధ నిషేధచట్టం, ఉత్తర ప్రదేశ్ గోశాలచట్టం, 1964 పశుగణాభివృద్ధి చట్టం యివన్నీ రూపొందించింది, శ్రీ చరణ్. మేలుజాతి ఆవు, దూడలను ఉత్తర ప్రదేశ్‌నుండి మరో చోటకు ఎగుమతి చేయడాన్ని నిషేధించాలనీ, ఆ రాష్ట్రంలోనున్న గోవధనిషేధ చట్టాన్ని విస్తృత

వర్చి మరింత ప్రయోజన కరంగా రూపొందించడానికీ మంత్రివర్గం అనుమతి పొందాడు, 1965లో. అంతలో మే మాసం నాటికల్లా ఆ శాఖ శ్రీ చరణ్ చేతినుండి జారి పోవడంతో, ఈ నాటికూ్కడా అవి చట్టరూపం దాల్చకుండానే మిగిలిపోయాయి, 1953–'54లో పశువుల సంతలను సమగ్రం చేసూ బిల్లు నొకదానిని తయారుచేశాడు. దీనికి నమూనాగా తీసుకొనడానికి దేశంలో యిటివంటిదెక్కడాలేదు. దీన్ని అప్పటి ముఖ్యమంత్రి, పార్టీకూడా అంగీకరించాయి. కానీ పండిట్ పంత్ ముఖ్యమంత్రి పదవివదలి ఢిల్లీ వెళ్ళిపోవడంతో, పశుగణాభివృద్ధిశాఖ మరో మంత్రికి బదలీ కావడంతో, శ్రీ చరణ్ ఎంత మొత్తుకొన్నా, అది చట్టరూపమే దాల్చలేదు.

రవాణా శాఖామంత్రిగా కూడా శ్రీ చరణ్ చేసిన సంస్కరణలనేకం. బినామీ బదలాయింపులు, లంచాలవంటి వాటి నన్నింటినీ రూపుమాపి, పర్మిట్ నిజంగా ఎవరిపేర నమోదై యున్నదో నిఖార్సైన రికార్డు తయారు చేయించి, ఉత్తరోత్తరా ఏ ఒక్కరూ కూడా ఒక్క పర్మిట్ కన్నా ఎక్కువపొందే అవకాశం లేకుండా. గట్టి బందోబస్తు చేశాడు.

1958లో శ్రీ చరణ్ సింగ్ ఆర్థిక శాఖను నిర్వహించింది. కేవలం ఏడున్నర మాసాలే అయినా ప్రభుత్వధనం దుబారా కాకుండా ఆర్థికష్టం దుకై పెక్కు సంస్కరణలను ప్రవేశ పెట్టాడు. ఆహార ధాన్యాలపై అమ్మకపు పన్ను సమస్య అప్పటికి పెక్కు సంవత్సరాలుగా రావణాసురుని కాష్టంగా వేధిస్తూంటే, అటు వ్యాపారులకు, యిటు రైతాంగానికి, పైగా వినియోగదారుకీ యిబ్బంది లేకుండా, పరిష్కరించి అందరి మన్ననలను పొందాడు.

1958–'59లో కేవలం 4 మాసాలపాటు నీటి పారుదల, విద్యుచ్ఛక్తి శాఖామాత్యులుగా నున్నాడు, శ్రీ చరణ్. ఈ స్వల్ప కాలంలోనే ఆయన పెక్కుమంది అవినీతి పరులైన ఇంజనీర్లపై క్రమశిక్షణా చర్యలు తీసుకొన్నాడు. 1959 ఏప్రిల్ 23న ఆయన రాజీనామాపై నేషనల్ హెరాల్డు పత్రిక "నీటి పారుదల. విద్యుచ్ఛక్తి శాఖల్లో పేరుకొనియున్న

అవినీతిని, లంచగొండి తనాన్ని నివారించేందుకై ఆయను చేస్తున్న సేవ బహుధా శ్లాఘనీయం. అటువంటి పెద్దపేరుతోనున్న ఆశాఖలు రెండూ ఆయన రాజీనామాను వేడుకగా సంబరం జరుపుకుంటున్నాయి." అని వ్యాఖ్యానించింది. కొంతమంది కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు నిజంగానే వేడు కలు జరుపుకున్నారు. ఆ తర్వాత ఈ శాఖను చేపట్టిన మంత్రి శ్రీ గిరిధర లాల్ వారందర్నీ వదిలివేశాడు. ఛీఫ్ ఇంజనీరు అవినీతికి, లంచగొండి తనానికీ మారు పేరుగానుంటే, అతగాడ్ని ఉద్యోగ విరమణ చేయ మన్నాడు, శ్రీ చరణ్. దానికి ముఖ్యమంత్రి కోపగించుకొన్నాడు. అంతే గాక రినాడ్ డాంలో ఉత్పత్తయిన విద్యుత్తులో సగం, అతి తక్కువధరకు బిర్లాల అల్యూమినియం కర్మాగారానికి సరఫరా చేయాలని, శ్రీ చరణ్ లేకుండానే, ముఖ్యమంత్రి నిర్ణయం గైకొన్నాడు మార్చి 14న. 1963-'64 ఆడిట్ నివేదిక ప్రకారం "కేంద్ర నీటి పారుదల విద్యుదుత్పత్తి నిపుణుల అంచనా వేసింది, యూనిట్ విద్యుదుత్పత్తికి 3.16 పైసలవు తుందని; కానీ బిర్లా కంపెనీ వారికి యూనిట్ 2 పైసలకే సరఫరా చేశారు. దానివల్ల రాష్ట్రానికి నష్టం రూ 60. 35 లక్షలు, ఏడాదికి. ఆ రేటును గత 16 సంవత్సరాలుగా మార్చనేలేదు." పశ్చి మాటలకేమో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ సంపూర్ణానంద్ పెద్ద సోషలిస్టుకింద లెక్క, కోట్లాది రూపాయల విలువజేసే గొట్టపుబావులు, బోదెలు లేక పోవడాన నిరుపయోగంగా పడివున్నాయి. రాష్ట్రమంతటా వాటిని గురించి కేంద్ర ప్రభుత్వం పదే, పదే హెచ్చరించింది. అయినా దాన్ని పట్టించుకొన్న నాధుడే లేడు. వాటివల్ల లాభంపొందే రైతులు, నీటి పారుదల శాఖవారి అంచనాల ప్రకారం వాటిని త్రవ్వుకొనాలనీ, లేకుంటే ప్రభుత్వమే ఆ పనిపూర్తి చేసి, దానికయిన వ్యయం వారినుండి రాబట్టగలదని తీర్మానించాడు. దీనికవసరమైన న్యాయ ప్రతిపత్తి, చట్ట ప్రతిపత్తి కల్పించడానికి ప్రభుత్వంలోని వారెవరూ ముందుకురాలేదు. శ్రీ చరణ్ తర్వాత ఒకరుకాదు, యిద్దరు మంత్రులు మారారు. కానీ ఆ ప్రతిపాదనలాగే మిగిలిపోయింది. చివరికి 1963 జనవరిలో ఆపని శ్రీ చరణ్‌సింగే స్వయంగా కల్పించు

కొంతేగాని పూర్తి కాలేదు, అప్పటి కా నీటిపారుదల శాఖ ఆయన అధీనంలో లేకున్నా.

పోలీసు మంత్రి :-

శ్రీ చరణ్‌సింగ్ రాష్ట్ర దేశీయాంగశాఖా మంత్రిగానున్న పది హేనుమాసాలు పేర్కొన దగింది. ఆ కొద్ది కాలంలోనే ప్రజల ప్రశంసలను, పై పోలీసు అధికారినుండి క్రింది కానిస్టేబులు వరకూ అందరి మన్ననలను పొందాడు. ఆయన కాలంలో క్రమశిక్షణా చర్యలు వెనుకటి కన్నా అధికమయినదీలేదు. కానీ పోలీసుశాఖ సామర్థ్యాన్ని, నిజాయితీని చెప్పలేనంతగా పెంపొందించాడు. దానితో ప్రజల జీవనాని కొకభద్రత ఏర్పడింది. 1962 మార్చిలో ఆ శాఖ మరొకరికి మారినదానికి, ప్రతి ఒక్కరూ వ్యతిరిక్తత వ్యక్తపర్చారు. శాసన సభలో శాంతి, భద్రతల విషయం చర్చ కొచ్చినప్పుడల్లా, ప్రతిపక్షంవారు శ్రీ చరణ్‌ను తిరిగి ఆ శాఖను స్వీకరించమని పట్టుబట్టేవారు. ఆయన హోంశాఖా మంత్రయిన వెంటనే పోలీసు ఇన్‌స్పెక్టరు జనరల్‌ను పదవీ విరమణ చేయమన్నాడు ఏమంటే ఏ ఉన్నతాధికారైనా, రాష్ట్రం మొత్తం శాఖకు బాధ్యత వహించే వారు. ఆ పదవిలో 5 సంవత్సరాలకన్నా కొనసాగ కూడదని నిబంధనున్నా, ఏదో రాజకీయ పలుకుబడిని ఆధారం చేసుకొని, ఆ అధికారి ఆ పదవిలోనే కొనసాగు తున్నాడు. పైగా అవినీతికి పేరెన్నిక గన్నవాడు. అప్పట్లో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గానున్న శ్రీ శరత్ చంద్రమిశ్రా మహారాష్ట్రలో ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా ఎన్నికయ్యాడు. ఆయన నిజాయితీకి పేరెన్నిక గన్నవాడు. శ్రీ చరణ్ ఆయన్ను ఉత్తరప్రదేశ్‌లోనే ఉండ డాని కొప్పించి, అదనపు ఐ. జి. పి. గా నియమించాడు. పోలీసుశాఖ విధి నిర్వహణలో ఏ విధమైన రాజకీయ జోక్యానికీ తావివ్వనని హామీ యిచ్చాడు, శ్రీ చరణ్. 1947 నుండి కాంగ్రెసు వారి పరిపాలనా పుణ్యమా అని, నానాటికీ దిగజారుతూ వస్తున్న పోలీసు శాఖవారి పాలనా ప్రతిభ కిదొక క్రొత్త ఊపిరి నిచ్చింది, పోలీసు వారంతా చట్టానికి లోబడి, తమ

అంతరాత్మ ప్రబోధం ప్రకారం వర్తించాలేగానీ, మనిషికీ— మనిషికీ వివక్షత చూపరాదనీ, ఎంత పెద్దవారికైనాసరే పక్షపాతం ప్రదర్శించరాదనీ, హెచ్చరించాడు శ్రీ చరణ్. ఈ సందర్భంలో ఓ సంఘటనను పేర్కొనడం అవసరం. హజరత్‌గంజ్ క్రాసింగ్‌వద్ద విద్యార్థులు రోడ్డుచిహ్నాలు, ట్రాఫిక్ నిబంధనల నుల్లంఘించి కానిస్టేబుల్‌ను కొట్టారు. వారిలో ఒకరు ఒక గెజిటెడ్ ఉద్యోగానికెన్నికైతే పాతకేసు విచారణ కొచ్చింది. దీనిపై కొందరు అధికార్లు, పెత్తందార్లు సిఫార్సుకొచ్చారు. ఆ పిల్లవాడి తల్లి వితంతువు తాతవద్ద పెరిగాడు. ఆ మాతామహుడు, ఈ అవకాశంపోతే మనవడి భవిష్యత్తు దెబ్బతింటుందని శ్రీ చరణ్ కాళ్ళమీద పడ్డాడు. తల్లీ తాత పరి, పరివిధాల వేడుకొన్నారు. అయితే ఆ కుర్రవాళ్ళంతా పోలీసుల నివాసాలమధ్య సమావేశం జరిపి, వారిని ప్రాధేయపడితే, వెనుక దెబ్బలు తిన్న పోలీసులు ఒప్పుకొంటే, తన కభ్యంతరంలేదన్నాడు, శ్రీ చరణ్. అలా చేయక తప్పలేదు. ఆ పిల్లగాళ్ళకు. దానితో పోలీసువారికి కొత్త ధైర్యం వచ్చింది. తమ విధి నిర్వహణలో ఏదైనా యిబ్బంది ఎదురైతే, తమ కండలేకుండా పోదనే స్థైర్యం చిక్కింది ఆ పాతకేసును ఎత్తివేయడానికొప్పుకున్నారు. ఆ పిల్లవాడి కుద్యోగం వచ్చింది.

అల్హాబాద్ విశ్వవిద్యాలయపు విద్యార్థులు మానససరోవర్ సినిమా హాలును తగులబెట్టి విధ్వంసకాండ జరిపిన దానిపై న్యాయస్థానాల్లోనున్న కేసులను, ఎంత ఒత్తిడి వచ్చినా శ్రీ చరణ్ ఉపసంహరించలేదు. అదే విధంగా బలరాంపూర్‌కి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థులపైనున్న దొమ్మికేసులను కూడా ఉపసంహరించలేదు. అంతేగాదు. హమీర్‌పూర్ శాసనసభ్యునిపైనున్న దొమ్మికేసును కూడా ఎత్తివేయలేదు. యింకా ప్రతాప్‌ఘడ్ జిల్లాకు చెందిన శాసనమండలి సభ్యునిపైనున్న హత్యా నేరంపై చట్టబద్ధమైన విచారణ జరిపించడం, ఝూన్సీ జిల్లా కాంగ్రెసు శాసనసభ్యుడు ఆయన మిత్రులతో కూడి బావులు త్రవ్వకుండానే ప్రభుత్వ ధనం స్వాహా చేయడంపై విచారణ జరపడంవంటి పెక్కు సందర్భాలలో

ప్రభుత్వ, ప్రతిపక్షాలన్నీ వ్యతిరేకంగా పోరాడినాసరే, ప్రజాస్వామ్యంలో చట్టానికెవరూ అతీతులుకారని శ్రీ చరణ్ వాదించి, ఆ నేరస్తులను శిక్షపంసిందేనన్నాడు.

నేరపరిశోధనా శాఖవారి సుదీర్ఘమైన విచారణ తర్వాత ఓ నిందితుడైన కాంగ్రెసు పెత్తందారును న్యాయస్థానంముందు నిలబెట్టాడు మీరట్ జిల్లా పోలీసు సూపరింటెండెంటు. దాన్ని నివారించడానికి ముఖ్యమంత్రి ఆ అధికారి నాజిల్లానుండి బదిలీ చేశాడు. తాను నిర్దేశించిన విధానాలకు లోబడి పనిచేసిన పోలీసు అధికారిని రక్షించలేని తన మంత్రిత్వ పెత్తనం నిరర్థకమని శ్రీ చరణ్ 1961 జనవరి 10 న రాజీనామా చేశాడు.

మొత్తంగా పోలీసుశాఖ కుళ్ళిపోయినదని శ్రీ చరణ్ ఏనాడూ త్రోసివేయలేదు. న్యాయశాఖతో సహా మిగతా అన్ని ప్రభుత్వ శాఖలంత ఉన్నతంగా శ్రీ చరణ్ పోలీసువార్ని చూశాడు. దానివల్ల ఆ శాఖవారికొక క్రొంగ్రొత్త విలువను, మానసిక,నైతికబలాన్ని యిచ్చింది. దానితోద్విగుణీకృతోత్సాహంతోవారు శ్రీ చరణ్ ఆశించిన ఉన్నత శిఖరాలనందుకొన్నారు.

బదలీలు, ప్రమోషన్లు అవక-తవకలను గురించిన సిఫార్సుల నెన్నడూ శ్రీ చరణ్ దరిచేరనిచ్చేవాడుగాదు. ఎవరిద్వారా సిఫార్సులు చేయించుకొన్నాసరే వారికి సంజాయిషీలు, తాఖీదులు అందాయి. దానితో మరెవరూ శ్రీ చరణ్‌కు సిఫార్సులు చేయలేని వాతావరణం నెలకొన్నది. తప్పుచేస్తే, తమనేశక్తి రక్షించలేదనీ. మంచిచేస్తే, సమర్థవంతంగానుంటే తమ కభినందన- కొన్నిమార్లు బహిరంగ ప్రశంసలు కూడా లభ్యంకాగలవని పోలీసువారంతా తలపోశారు. సమర్థులకు, ప్రావీణ్యతనుబట్టి ప్రమోషన్లు, కష్టించి పనిజేసేవారికి నిత్యనీరాజనం. యింక మిగిన యితరేతర అంశాలకెంతమాత్రం తావులేదు. తద్వారా సమర్థులకు- అసమర్థులకు మధ్య స్పష్టమైన విభజనరేఖ గీయబడింది. 1952 ఫిబ్రవరి, మార్చినెలల్లో జరిగిన సబ్ఇన్‌స్పెక్టర్ల ఎంపికలో తమ కెటువంటి సిఫార్సురాలేదని, అలా ఒక్క- సిఫార్సుకూడా రాకపోవడం ప్రప్రథమమని పోలీసు ఐ. జీ.

శ్రీ చరణ్‌తో చెప్పాడు శ్రీ చరణ్ దేశవ్యవహారాలమంత్రిగా ఓ విధాన ప్రకటనను చేశాడు — ఒకేరకమైన, ఒకేస్థాయిలోని తప్పుకు— చిరుద్యోగి కన్నా, బడాఉద్యోగికి పెద్ద మోతాదులో శిక్షఉంటుందని.

నేరాలను సరీగా నమోదు చేయాలిగాని, వాటి సంఖ్యనుబట్టి ఆ పోలీసుస్టేషను సమర్థతను అంచనా కట్టమన్నాడు, వెనుకటి మాదిరిగా. దాంతో నిజమైన నేరాలు దొరకతనం వారి దృష్టికెళ్ళేవి— విచక్షణలేని అధికారుల పీడన తప్పింది ప్రజలకి. 1961 డిశెంబరు పోలీసుల వారం సందర్భంగా ఆ అధికారుల నుద్దేశించి ప్రసంగిస్తూ—" కోర్టులో కేసును రుజూ చేసుకొనేందుకే సాక్ష్యాలను సేకరించకుండా ఒక నిబంధనను జారీచేయడం అవసరం" అన్నాడు శ్రీ చరణ్.

జిల్లా పోలీసు సూపరింటెండెట్లు, డి. ఐ. జి. లు తమ ఇన్‌స్పెక్షన్ పర్యటనలో ఖర్చులను ఎస్. ఐ. లపై వేయకూడదని తాఖీదులిచ్చాడు. నిబంధనల నతిక్రమించి కానిస్టేబుళ్ళను, తమసొంత అవసరాలకు, యింటి పనులకు వినియోగించుకొనకుండా కట్టడిచేశాడు. 1961 వరకూ ఎస్. ఐ ల ఎంపికలో శరీరదార్ఢ్యానికి 11 మార్కులు దాటితే చాలు. ఆపైన ఎన్ని వచ్చినా ఒకటే శ్రీ చరణ్ ఈ పద్ధతిని మార్చి ఈ మార్కులుకూడా మొత్తంలో కలపడంతో. వెనుకటికన్నా మంచి శరీర సౌష్టవమున్నవారు ఎస్. ఐ లుగా వచ్చారు. కానీ తర్వాత కొన్నాళ్ళకు శ్రీ చరణ్ ఆ శాఖ నొదలిన తర్వాత, ముఖ్యమంత్రి ఈ పద్ధతిని మార్చడంతో, పాట మళ్ళా మొదలుకే చేరింది. యస్. ఐ లుగా ఎంపికైనవారు మొరాదాబాద్ పోలీసు శిక్షణ కళాశాలలో తర్ఫీదు కెళ్ళబోయేముందు వెయ్యి రూపాయలు ధరావత్తు కట్టవలసియుండేది. దాన్ని పూర్తిగా రద్దుచేసి, వారికి నెలకు రూ 80, ఉపకార వేతనంగా ఏర్పర్చాడు, శ్రీ చరణ్. ఈ శాఖను చేపట్టిన మూడుమాసాలకు శాసన సభలో పోలీసు పద్దులను ప్రవేశపెడుతూ— నేరస్థుల ప్రతిఘటనలోనూ, విధి నిర్వహణలోనూ చనిపోయిన పోలీసు కుటుంబాలకు— వారు బ్రతికుంటే, ఇంక్రిమెంట్‌లతోసహా ఎంత జీతమిచ్చేదో అంత మొత్తమూ వారి కందేట్లు ఏర్పాటు చేశాడు, ఆయన

హయాంలోనే కాన్పూర్, లక్నోలలో సంచార పోలీసుదళాలను, రేడియోలతోనూ, వైర్‌లెస్‌లతోనూ ఏర్పాటుచేసి. 24 గంటలూ అహర్నిశం ఆపదలోనున్న వారెవరు ఫోనుచేసినా, కాకితో కబురంపినా, ఈ దళాలు వారి రక్షణకొచ్చేట్లు చేశాడు. దీనివల్ల పోలీసువారు సమర్థవంతంగా పని జేసేందుకూ, జనావళికి రక్షణయుండేందుకూ, తోడ్పడ్డాడు.

పోలీసుల అసమర్థతకు ప్రధాన కారణం యితరేతర దేశాల్లోనూ. రాష్ట్రాల్లోనూ యున్నట్లుగా తగినంత సిబ్బంది లేకపోవడం, ఆధునిక సౌకర్యాలు కొరవడడం, పోలీసు ఠాణాలలో తగినంత వసతులు, అవసరమైన శిక్షణ, ఆధునిక ఆయుధాలు, వరిముట్లు. కమ్యూనికేషన్లు లోపించడమేనని బహిరంగంగా ప్రకటించాడు శ్రీ చరణ్. స్వల్ప జీతాలు, విద్యుత్ వసతికూడా లేని పోలీసుస్టేషన్లు, గృహవసతిలేని పోలీసులు— వీటన్నింటినీ మించి నేరస్తునికికూడా చట్టంలో హెచ్చు అవకాశాలు తప్పించుకొనడానికుండడం, పోలీసులపైననే బాధ్యతంతా పడడం— అంతా యిబ్బందే. అవసరమైన న్యాయమైన కోరికలుంటే. అవసరాలేర్పడితే, సమస్యలుంటే —వాటిని పరిష్కరించే హోంశాఖా మంత్రున్నాడనే ధైర్యం, పోలీసులకు కలిగింది. సాధారణంగా ప్రభుత్వ శాఖల సిఫార్సులకు దొరతనంవారు మొత్తంగా బుట్టదాఖలా చేయటంగానీ లేక ఏళ్ళూ, పూళ్ళూ గడిచినాక ఆమోదించడంగానీ జరుగుతూంటుంది. కానీ పోలీసు కమీషన్ సిఫార్సులను— జీతాలు, పోలీసుల సంఖ్యలను పెంచడంతోసహా, అన్నింటినీ మూడుమాసాలు తిరక్కముందే అమలుపర్చాడు, చౌదరీ చరణ్‌సింగ్.

క్రిమినల్ లాను, ఎవిడెన్స్ చట్టాన్ని— కాలానుగుణ్యంగా మార్చడం కొరకై శ్రీ చరణ్ పోలీసు ఐ. జి. ని అవసరమైన సమాచారాన్ని సేకరించమన్నాడు. ఈ విషయమై అప్పటి ప్రధానితోకూడా చర్చించాడు. పాతబడిపోయిన జూదం చట్టాన్ని ఎత్తివేసి కొత్త చట్టాన్ని ప్రవేశ పెట్టడమేగాక, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌నే మార్పుచేశాడు. పోలీసుశాఖ యావత్తూ చౌదరీసాబ్‌ను కఠోరమైన పరిపాలకునిగానేగాక, తమ హక్కుల రక్షకునిగా కూడా భావించి పనిజేసింది.

అటవీశాఖ :-

చౌదరీ చరణ్‌సింగ్ అటవీశాఖామంత్రిగా నున్న మూడున్నర సంవత్సరాల్లోనూ, ఆ రాష్ట్రంలో రెండు దశాబ్దాలుగా పరిష్కారంగాని పెక్కు సమస్యలను పరిష్కరించగలిగాడు. 1600 చదరపు మైళ్ళ అడవి ప్రాంతం రెవెన్యూ శాఖవారి చేతుల్లోపడి నాశనమై పోతూంటే, దాన్ని తిరిగి తన శాఖలోకి తీసుకొన్నాడు. రాజకీయ కారణాలవల్ల పండిట్ పంత్ కాలంనుండి కూడా ఆ పనిచేసే ధైర్యం లేకపోయింది యమున, చంబల్ లోయ ప్రాంతాల్లో అడవులను పెంచే పథకాన్ని చేపట్టి, భూసార పరిరక్షణకు ప్రోడిచేశాడు. 1966లో రోడ్ల కిరువైపులా చెట్లను నాటడం పబ్లిక్ వర్క్స్ శాఖనుండి, అటవీశాఖ క్రిందకు తీసుకొని, ఆ కార్య క్రమాన్నభివృద్ధి పర్చాడు. తెహ్రీ రాష్ట్రంనుండి వచ్చిన వారసత్వం ప్రకారం, 16 సంవత్సరాలుగా రిజర్వుఅడవుల చట్టాన్ని రూపొందించ డంలో నున్న అసందిగ్ధతను తొలగించాడు. 1952లో జమీందార్ల నుండి ప్రభుత్వం స్వాధీన పర్చుకొన్న అడవులను స్థిరీకరించడంలోని సత్వరత కను, శీఘ్రతరం గావించాడు అడవుల నాక్రమించడం, నాశనం చేయడం వంటి వాటి నంతమొందించి, వాటిని తమ సొంత ఆస్తిగానూ, మాగాణి గాను ఆసక్తితో చూసుకొన్నాడు. వన్య మృగ సంరక్షణ చట్టాన్ని రూపొందించినా, తగిన వ్యవధి లేకపోవడాన దానికి చట్ట ప్రతిపత్తి తేలేకపోయాడు.

1966లో స్థానిక స్వపరిపాలనా శాఖను చేపట్టిన చౌదరీసాబ్ మున్సిపల్ ఉద్యోగుల సర్వీసును కేంద్రీకృతం గావించడం మూడు మాసాల్లో పూర్తి గావించాడు. దీనివల్ల పాలనా సామర్థ్యం పెరగడమే గాక, పెత్తందారీతనం, వర్గ వైషమ్యాలు సన్నగిల్లాయి. స్థానిక సంస్థల ఆర్థిక సౌలభ్యాన్ని పెంపొందించేందుకై సూచన లీయడానికొక సంఘాన్ని నియమించాడు, పే కమీషన్‌తో పనిలేకుండానే ఉద్యోగుల జీతాలను సవరిం

చాడు కొన్ని స్థానికసంస్థల స్థాయిని పెంచాడు. దీనివల్ల ఆయా స్థానిక సంస్థలలో పనిచేసే ఉద్యోగులకెంతో ఊరట కలిగింది. 1966 డిశెంబరు, 1967 జనవరిలలో రాష్ట్రంలోని ఉద్యోగులంతా సమ్మెచేసి పనిస్తంభించి పోయినా, స్థానికసంస్థలు మాత్రం ఈ ఆందోళనాసాగరం మధ్య ప్రశాంత ద్వీపాలుగా చక్కగా పనికొనసాగించు కొన్నాయి. సమ్మె లేకుండా. చౌదరీసాబ్ ఎడ తన శాఖలోని ఉద్యోగులకు గల విశ్వాసాని కిదొక ప్రబల నిదర్శనం.

1967 నాటికి, విద్య, పరిశ్రమలు, సహకార, పి. డబ్ల్యు. డి. మినహా, మిగిలిన అన్ని శాఖలను చౌదరీసాబ్ నిర్వహించాడు అన్ని శాఖల్లోనూ సమర్థతను ప్రవేశపెట్టాడు. తానే శాఖను చేపట్టినా ఉద్యోగులు చెప్పినట్లుగా గాక, తానే స్వయంగా నిర్ణయాలు తీసుకొనేవాడు. పైగా శ్రీ చరణ్‌కు దానికి సంబంధించిన వివరణలు, అంశాలు- అన్నీ కరతలా మలకం దానివల్ల ఏ ఉద్యోగికూడా ఆయన దగ్గర తోక ఆడించే ధైర్యం లేకపోయేది.

హరిజనోద్ధరణ :-

రెవెన్యూమంత్రిగా శ్రీ చరణ్ హరిజనుల ఉన్నతికి గై కొన్న చర్యలు, చేపట్టిన పథకాలు అపారం. కానిస్టేబులు, జవానులు, 4వ తరగతి ఉద్యోగులు డ్యూటీలో నుండగా దినవేతనం పావలా నుండి ఆరణాల వరకూ వుండేది పండిట్ పంత్ మంత్రివర్గంలో పార్లమెంటరీ కార్యదర్శిగా నుండే రోజుల్లోనే దాన్ని 12 అణాలకు పెంచాడు, శ్రీచరణ్. 1954 నవంబర్- 958 మార్చిల మధ్య రెవెన్యూ మంత్రిగా నుండగా జిల్లా కలెక్టరు కార్యాలయాల్లో జవానులు, వెట్టివాళ్ళు, లేఖపాళ్ళలో హరి జనుల సంఖ్య కనీసం 18 శాతం వుండేట్లు చూశాడు. దీనికిపై అధికార్లంతా వ్యతిరేకం. ఈ అంశం అమలుగాకుండా త్రొక్కి పెట్టేవారు. దానితో 1963 డిశెంబరులో శ్రీ చరణ్‌సింగ్ తాను నిర్వహిస్తున్న వ్యవసాయ,

పశుగణాభివృద్ధి, అటవీ శాఖలలోని 4వ తరగతి ఉద్యోగా లన్నింటినీ 18శాతం పూర్తయ్యేంత వరకూ. ముందుగా షెడ్యూల్డ్ జాతులు, కులాల వారికే యివ్వాలని, తాఖీదులిచ్చాడు, కానీ కొన్ని మాసాల తర్వాత, ఈ ఉత్తర్వు రాజ్యాంగ విరుద్ధమని, నియామకాలశాఖ రద్దుచేసింది. తక్కువ జీతం వారికి-ఎక్కువ కరువుభత్యం, ఎక్కువ జీతం వారికి-తక్కువ కరువుభత్యం సూత్రం ప్రవేశ పెట్టింది శ్రీ చరణ్. యిటువంటి నిర్ణయం తీసుకొన్న నాయకులలో ప్రప్రథముడు- చౌదరీ చరణసింగ్.

ప్రజా శ్రేయస్సుకు, పరిపాలనా పటిష్టతకు శ్రీ చరణ్ పెక్కు సంస్కరణలను ప్రవేశపెట్టాడు. అయితే వాటన్నింటినీ మొత్తంగా కొట్టి పారవేయడంగానీ లేక వీలైనంత ఎక్కువగా ఆ సంస్కరణలను నీళ్ళు గార్చడం గానీ చేసేవారు కాంగ్రెసు పెత్తందార్లు.

1950 ప్రాంతాల్లోనే ఆ రాష్ట్రానికి కవసరమైన చిన్న తరహా నీటి వనరుల విషయాన్ని, అందునా తూర్పుజిల్లాల ఆవశ్యకతను, నొక్కి వక్కాణించాడు శ్రీ చరణ్. కానీ దీన్ని గూర్చి పట్టించుకొన్న వారేలేరు. పైగా శ్రీ చరణ్‌కు పశ్చిమ జిల్లాల్లో తప్ప మరొక ప్రాంతాన ఖర్చుపెట్టడం యిష్టంలేదనే వాస్తవవిరుద్ధ వదంతులను ప్రచారం చేశారు. ఏది ఏమైనా ఈయన వాదనలోని వివేకతను గుర్తించడానికి 1964 వరకూ పట్టింది. ఈలోగా కోట్లాది రూపాయలను అక్కరకురాని ప్రాజెక్టులపైన, పథకాలపైన వెచ్చించి, నీటిపారుదల శాఖను పన్నుగట్టేవారి పాలిట ఒక గుదిబండగా మార్చారు. తెల్లదొరల కాలంలో రూ 1.75 కోట్లు వార్షి కాదాయంతో నున్న ఈ శాఖని 1967 నాటికల్లా రూ 8.5 కోట్లు వార్షిక నికర నష్టాన్నిచ్చేదిగా దిగజార్చారు.

కులతత్వంపై పోరాటం :-

భారత జాతిని, హిందూ మతాన్ని పట్టిపీడించే రుగ్మతలలో కుల తత్వం ప్రధానమని విశ్వసించిన శ్రీ చరణ్ విద్యాలయాల్లోనూ, ఉద్యోగా

ల్లోనూ కులం నమోదు చేయడాన్ని నిషేధించాలనీ, అవసరమైతే షెడ్యూల్డు కులమా? కాదా? అనే వివరణకు మాత్రమే పరిమితమై వుండాలనీ 193' ఏప్రిల్‌లోనే కాంగ్రెసు శాసన సభాపక్షంలో తీర్మానాన్ని ప్రవేశ పెట్టాడు, శ్రీ చరణ్. భూముల రికార్డులు, దస్తావేజులవంటి వాటిలో కులం పేర్కొనగూడదని 1948లో వెలువడిన ప్రభుత్వ ప్రకటనకు ప్రధాన కారకుడు, శ్రీ చరణ్. రాష్ట్రంలోని గజిటెడ్ ఉద్యోగాలన్నింటినీ కులాంతరవివాహం చేసుకొన్న వారికి, భాషాంతర వివాహం చేసుకొన్నవారికి, కేంద్రంలో గెజిటెడ్‌ఉద్యోగా లన్నింటినీ మొక్తంగా ప్రత్యేకించాలని, 1954లోనే శ్రీ చరణ్ సూచించాడు. కులాల పేరిట స్థాపించిన విద్యాలయాలకు ప్రభుత్వ సహాయం వుండరాదన్నాడు. కానీ కుల నిర్మూలనమే తమ ధ్యేయమని చాటింపు వేసుకొనే కాంగ్రెసు పెత్తందార్లెవరూ దీని కంగీకరించలేదు.

రెవెన్యూ డివిజినల్ అధికారుల కార్యాలయాలను జిల్లా కేంద్రాల నుండి తాలూకాలకు మార్చినట్లయితే, ఆ అధికారులు ప్రజలకు దగ్గర్లో అందుబాటులో నుంటారని, శ్రీ చరణ్ 1952 నుండి వాదిస్తూనే యున్నాడు. దీనివల్ల అభివృద్ధి కార్యక్రమాలు శీఘ్రగతిన సాగుతాయని, ఆయన ఆశ. ప్రతి ఒక్కరూ దాని కంగీకరించారు. కానీ దానికవసరమైన ద్రవ్య కేటాయింపులు ఏర్పాటు చేయక, ఆ ప్రతిపాదనను నీళ్ళగార్చివేశారు.

పెరుగుతూన్న జనాభాను గూర్చి ఆ రాష్ట్రంలో వాపోయిన మొట్టమొదటి రాజకీయ నాయకుడు, శ్రీ చరణ్. 1956లో బస్తీ జిల్లా కాంగ్రెసు కార్యకర్తల సమావేశంలో, జిల్లా కాంగ్రెసు సంఘం తరఫున కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని చేపట్టమని ఉపదేశించాడు, శ్రీ చరణ్. కానీ 1964 నాటికిగాని, యిది రాష్ట్ర ప్రభుత్వం వారికి నాటలేదు.

చట్టం కళ్ళుగప్పి, అక్రమంగా సంపాదించిన నల్లధనం దేశంలో చలామణిలోనున్న మొత్తం కరెన్సీలో 3వ వంతున్నదని, దానివల్ల

లంచగొండితనం, ధరలు పెరగడం, కరువు భత్యం హెచ్చింపవలసి రావడం, శాంతిభద్రతల లోపంవంటి పెక్కు అనర్థాలకు తావిస్తూన్నదని, గనుక కరెన్సీ రద్దుద్వారా నల్లధనాన్ని మాపుమాపే ఒక పథకాన్ని రూపొందించి, ప్రభుత్వంలోని పెద్దలందరికీ అందజేశాడు, 1966 లోనే. ధరలు తగ్గు ముఖం పట్టకపోతే, 1967 ఎన్నికల్లో కాంగ్రెసు ఓడిపోవడం తప్ప దని కూడా హెచ్చరించాడు కానీ ఈ నల్లధనం గలవారి ప్రభావమే కాంగ్రెస్‌వారిపై ఎక్కువ, యిక శ్రీ చరణ్ సలహా వినేదెవరు ?

ప్రమాదంలోపడ్డ సరిహద్దులు :-

1953 నుండి ఈశాన్యసరిహద్దుల్లో నాగాల తిరుగుబాటు రగులుతూనే యున్నది. అక్కడ నియమించబడ్డ సైన్యం ఆత్మరక్షణకు వినా, మందుగుండును వినియోగించరాదని ఉత్తర్వు చేస్తూ, ప్రతి మూడు మాసాల కొకసారి మర్చిపోకుండా పరిస్థితి అదుపులోనున్నదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించేది కానీ వాస్తవానికి పరిస్థితి నానాటికీ దిగజారుతూండేది 1964లో మన దొరతనం. తిరుగుబాటు నాగాలతో కాల్పుల విరమణ ఒప్పందానికొచ్చింది. కానీ నాగాలు దాన్ని త్రికరణ శుద్ధిగా అమలుపర్చక, వారి స్థావరాలను, ఆయుధ సంపత్తిని పటిష్ఠం గావించుకొనడం ఆరంభించారు. అయినా మనవారు మాత్రం ఏళ్ళ తరబడి శాంతి సంభాషణలు జరుపుతూనే కూర్చున్నారు. ప్రపంచ చరిత్రలో అన్ని తిరుగుబాటుల నణచి వేసినట్లుగానే, ఈ సమస్యనుకూడా ధైర్యంతో ఎదుర్కొనాలని శ్రీ చరణ్ 1959 నుండి, వ్రాస్తూనేయున్నాడు. దీనిపై ఇద్దరు ప్రధానులకు, ఒక హోంశాఖా మంత్రికి, మరింకెందరో నాయకులకు నచ్చ జెప్ప యత్నించాడు. కానీ ఫలితం పూజ్యం దీనివల్ల ప్రపంచంలో ఒక్కరు కూడా మనల నభినందించకపోగా, సరిహద్దులను రక్షించి, సమగ్రతను కాపాడలేని బలహీనులుగా మనం లోకం దృష్టిలో మిగిలి పోతామని హెచ్చరించాడు. నాగాలు మన శత్రు పక్షాలైన చైనా, పాక్‌లతో కలిసి

అదనుచూసి మనలను దెబ్బతీస్తారన్నాడు. ఈ సమస్యను సమర్థవంతంగా పరిష్కారంగావించడంలో వచ్చిన విఫలత్వమే, మిజోలు, కుకీలు తలెత్తి, తదితర పర్వతరాష్ట్రాల నేర్పాటుచేయమనే ఆందోళనకు వరవడి దిద్దింది.

పాకిస్తానీ ఏజెంట్ల కార్యకలాపాలను గూర్చి, అస్సాం తదితర సరిహద్దు రాష్ట్రాల్లో విదేశీ మిషనరీలద్వారా, పరాయిదేశాల వారు కొనసాగించే గూఢచారి చర్యలను గూర్చి సవివరంగా 1963లోనే అప్పటి కేంద్ర దేశీయాంగ శాఖామంత్రికి, ప్రధాని స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రికి వ్రాసినా, దాన్ని నివారించడానికి తగిన చర్యలను చేపట్టే ధైర్యంవారికి లేకపోయింది. ఆ తర్వాత క్రమ, క్రమంగా ఈశాన్య సరిహద్దు యావత్తూ యుద్ధ జ్వాలలు నెలకొన్నాయి. ఆ పైన వచ్చిన వార్తలనుబట్టి నాగాల్యాండ్‌లో చైనా సైనికులు రహస్య కార్యకలాపాల కొడిగడుతున్నారని తెలిసింది అనతి కాలంలోనే యిది మరొక వియత్నాంగా రూపుదాల్చినా ఆశ్చర్యపోవలసింది లేదు కాంగ్రెసు దొరతనం వారికి తగినంత ముందుచూపు లేకుండా, శాంతి ప్రవచనాలు వల్లించినందువల్ల వనగూడిన ప్రయోజనమిది.

కాశ్మీర్‌లోయను పాకిస్తానీయులు కబళించే ప్రమాదమున్నదని 1947 అక్టోబరులోనే శ్రీ చరణ్, పండిట్ జవహర్లాల్‌ను హెచ్చరించారు. శ్రీ నెహ్రూ అలా జరుగుతుందనే అసలు ఊహించలేదు. దానికవసర మైన రక్షణనూ కల్పించలేదు మన సరిహద్దుల నానుకొని టిబెట్‌లో చైనీయులుండడంలోనున్న ప్రమాదాన్ని గూర్చి ఉపప్రధాని సర్దార్ వల్లభాయి పటేల్‌ను హెచ్చరించారు. సర్దార్‌వల్లభాయికూడా శ్రీ చరణ్ అభిప్రాయాలతో ఏకీభవించినా పండిట్ జవహర్లాల్ వాస్తవ విరుద్ధఆలోచనలో నుండడాన, ఏమీ చేయలేకపోయాడు.

సమాజానికి శ్రీ చరణ్ చేసిన సేవలు, చేపట్టిన నిర్మాణాత్మక కార్యక్రమాలు అపారం-అనితరసాధ్యం రోడ్లు వెయ్యడానికి, అస్పృశ్యులు,

ఇళ్ళు, కర్మాగారాల వంటివి నిర్మించడానికై బడ్జెట్లలో నిధుల నేర్పాటు చేయడానికంతగా తెలివితేటలు, సమర్థత అవసరంలేదు. కానీ కొత్త ఆలోచనలు చేసి, వినూత్న పంథాను త్రొక్కి, కొత్త చట్టాలను రూపొందించి, పాత అలవాట్లు, అసవాయితీల స్థానంలో ఆధునిక వ్యవస్థను నెలకొల్పడానికి, తద్వారా కోట్లాది జనావళి తలవ్రాతలను మార్చడానికి ఎంతో సమర్థతవసరం. స్వాతంత్ర్యానంతరం, ఆధునిక ఉత్తర ప్రదేశ్‌ను రూపొందించడంలో ప్రధాన పాత్రధారి చౌదరీ చరణ్‌సింగ్. తాను చేద్దామనుకొన్నదాన్ని చేసేందుకు పూర్తి స్వేచ్ఛ శ్రీ చరణ్‌కున్నట్లయితే. యిప్పటిలా నగుబాట్లకు లోనుగాక, ఆ రాష్ట్రం రూపురేఖలే మారిపోయివుండేవి.

అసంఖ్యాక వ్యాసాలను వ్రాయడం, వివిధ సమస్యలపై రేడియోలో ప్రసంగించడమేగాక మంత్రిగా ఉండికూడా పెక్కు పుస్తకాలను రచించాడు. జమీందారీ రద్దు, వ్యవసాయ సంస్కరణలు, భారతదేశ పేదరికం-దాని పరిష్కార మార్గాలు, సహకార వ్యవసాయం-ఒక పరిశీలన వంటి పెక్కు పుస్తకాలను వెలువరించాడు. "శిష్టాచారం" అనే హిందీ పుస్తకాన్ని 1941లో జైలులోనుండి వ్రాశాడు. మంచి అలవాట్లను గూర్చి శ్రీ చరణ్ రచించిన ఆ పుస్తకం, అముద్రితం.

ప్రజాభిమానం :-

పండిత-పామరులందరిలోనూ శ్రీ చరణ్‌కుగల పలుకుబడి అపారం. అందుకే 1967 ఎన్నికల్లో 52 వేలకు పైగా మెజారిటీతో ఎన్నికై, శాసన సభ ఎన్నికలలోనే రికార్డును సృష్టించాడు జనవరి 17న నామినేషన్లు వెయ్యడానికి ముందు, తన నియోజక వర్గంలోనున్నది కేవలం 5 రోజులు మాత్రమే. 1961లో, మీరట్ జిల్లా కాంగ్రెసు సంఘం పాతిక సంవత్సరాల తర్వాత శ్రీ చరణ్ వ్యతిరేకవర్గం వారి చేతుల్లోకి పోయింది. ఎంత చిత్రమంటే వాళ్ళసలు 1967 ఎన్నికల్లో శ్రీ చరణ్‌కు కాంగ్రెసు టిక్కెట్టు యివ్వడానికే అంగీకరించలేదు.

శాసనసభ ప్రతి సమావేశంలోనూ శ్రీ చరణ్ చేపట్టిన ప్రజోపయోగ, అభ్యుదయ పథకాలకు ప్రతి పక్షాలవారి అభినందనలపారంగా లభించేవి బహుశః దేశంలో మరే మంత్రి అంతగా శ్లాఘించబడియుండడు. అంతేకాదు చౌదరీసాబ్ మాట్లాడుతూండగా, కేటాయించిన సమయం పూర్తయితే సమయాన్ని పొడిగించమని ప్రతిపక్షంవారు ప్రాధేయ పడేవారు సభాపతిని. ఆయన అనుభవాలద్వారా, ఉపన్యాసాలద్వారా నేర్చుకొని, లాభం పొందుదామని వారి కోరిక. ఈ సంఘటలనేకం ఉత్తర ప్రదేశ్ శాసనసభా చర్చల రికార్డులలో పేర్కొనబడి, నమోదైయున్నాయి.

చౌదరీసాబ్ అవినీతి, లంచగొండితనాలపై అంతటి తీవ్రయుద్ధం చేయగలగడానికి, ఆయన వ్యక్తిగత జీవితం నిష్కళంకంగా నుండడమే కారణం. తనకు చుట్టాలని, స్నేహితులనీ-తనకు తెలిసిగానీ, తెలియకుండా గానీ అధికార ప్రాబల్యాన్నుపయోగించుకొననీయలేదేనాడు కూడా. ఉత్తర ప్రదేశ్ రాజకీయ తీరు - తెన్నులపై పరిశోధన జరిపిన ఓ అమెరికా శాస్త్రజ్ఞుడు శ్రీ చరణ్ తన సొంత మనుష్యులకూకూడా తాను చేయగలిగింది చేయడంలేదని పేర్కొన్నాడు, తన పరిశోధనా పత్రంలో. వ్యాపారస్థులతోనూ. పారిశ్రామిక వేత్తలతోనూ ముఖమాటం, లాలూచీ ఎంతమాత్రం లేవు. 19 7 జూన్‌లో జరిగిన 9 రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ముందు కొందరు, కొందరు పారిశ్రామిక వేత్తలు శ్రీ భానూప్రతాప్‌సింగ్ (ప్రస్తుత ఆహార, వ్యవసాయశాఖా మంత్రి) వద్దకొచ్చి ఎన్నికలకు మీకెంత డబ్బు కావాలన్నా యిస్తాం, మాకు టెలిఫోను చేస్తే చాలని ఒత్తిడి తెచ్చారు. వారికి చౌదరీసాబ్ చెంతకెళ్ళడానికే భయం. శ్రీ భాను ఈ విషయం శ్రీ చరణ్ దృష్టికి తెస్తే-"అలా మనం వారినుండి ఎన్నికలకని నిధులు తెస్తే, మన పతనానికది నాంది కాగలదు. రైతులనుండి వినా మరొకరివద్ద నిధులు స్వీకరించడం, ప్రమాదకరం" అని వారించాడు, శ్రీ చరణ్. ఆయన ఆధారపడేది, సామాన్య జనంపై. 1977 లోక్‌సభ

ఎన్నికల ప్రచారం సందర్భాన ఓ బహిరంగ సభలో నిధులకై విజ్ఞప్తి చేయగా, అక్కడికక్కడ రూ. ఒకటి, రెండు, ఐదు చొప్పున మొత్తం రూ. లక్ష అరవై మూడు వేలకు పైగా సమర్పించారు, సాదాజనం. అది - ఆయన ఎడ ప్రజలకుగల ఆప్యాయత.

నీతి - నిజాయితీలు :-

ఇంతకాలం అధికారాన్ని చెలాయించినా, శ్రీ చరణ్ నిజాయితీని ప్రతికక్షులైనా సరే వ్రేలెత్తి చూపలేరు విధి నిర్వహణలో ఎంత నిమగ్నతతో, ఊపిరి సలపకుండా వుంటాడంటే తన సొంత రాష్ట్రంలోనున్న బదరీనాథ్‌ను చూడ్డానికిగానీ, ప్రక్కనున్న చండీఘర్‌ను సందర్శించడానికిగాని తీరికలేదింతవరకూ. అసలు కలకత్తానే ఎరుగడు. ఉచితంగా అమెరికా పర్యటించమని ఆహ్వానించినా పోలేదు.

మంత్రులు నిరాడంబరంగానుండి, సామాన్యులకు దగ్గరగా నుండాలంటాడు ఆయన పట్టుదలవల్లనే మంత్రుల జీతాలు రూ. 1000 కు తగ్గించబడ్డాయి. వారికి చవర్లెట్‌వంటి ఖరుకార్ల స్థానంలో అంబాసిడర్‌వంటి సాదా కార్లొచ్చాయి. మంత్రుల నివాసాలపైన, కార్లపైన జాతీయ జెండా లెగరడం. ప్రయాణంలో పర్సనల్ అసిస్టెంట్లు అనుసరించడం రద్దయినాయి. 1955 జూన్‌లో ఈ అంశాలపై మంత్రివర్గ సమావేశంలో శ్రీ చరణ్ చర్చ లేవదీస్తే, సీనియర్ మంత్రులంతా విరుచుకుపడ్డారు. వారు తనపై చేసిన వ్యాఖ్యలకు శ్రీ చరణ్ సమావేశంనుండి వాకౌట్‌కూడా చేయవలసి వచ్చింది.

ప్రజాసేవకు మంత్రిపదవి నొక మార్గంగా భావించాడేగాని, చరణ్ దాన్నెనాడూ ఒక ధ్యేయంగాను, లక్ష్యంగానూ పెట్టుకొనలేదు. అందుకనే జేబులో ఎప్పుడూ రాజీనామా లేఖ నుంచుకొనేవాడు శ్రీ చరణ్. ప్రజా శ్రేయస్సుకు ఆత్మాభిమానానికి దెబ్బ తగులుతున్నదని అనుమానంప స్తే చాలు-రాజీనామా చేసేవాడు. 1947 మార్చిలో, 1948 జనవరిలో, 1950 మార్చిలో, 1957 జనవరిలో, 1957 నవంబర్‌లో, 1959 ఏప్రిల్‌లో,

1963 ఆగష్టులో, 1967 ఏప్రిల్‌లో, 1967 ఆగష్టులో మంత్రి పదవులకు' చివరికి ముఖ్యమంత్రి పదవికూడా రాజీనామా చేశాడు.

1959 ఏప్రిల్ 22న ఆయన రాజీనామా నామోదించిన రోజున, ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధికార దినపత్రిక నేషనల్ హెరాల్డు సంపాదకీయంలో – "శ్రీ చరణ్ రాజీనామాలో వ్యక్తిగత, సంస్థాగత విషాదాంత మున్నది. ఇది ఉత్తరప్రదేశ్ పరిపాలన కొరక తీరనిలోటు. అరుదుగాగాని దొరకని నిజాయితీ, సమర్థత, శ్రమించేతత్వంగల సహచరుడ్ని కోల్పోయారు, ముఖ్యమంత్రి శ్రీ సంపూర్ణానంద్. పెక్కు విధానాల్లో మేము అనేకసార్లు శ్రీ చరణ్‌ను తీవ్రంగా వ్యతిరేకించినా, విమర్శించినా, ఆయన నిజాయితీని శంకించలేము. ఆయన విషయ పరిజ్ఞానాన్ని కాదనలేము. ఆయన కర్తవ్యనిష్టను వ్రేలెత్తి చూపలేము"– అన్నది. ఈ లక్షణాలన్నింటినీ, కక్షతోనున్న రాజకీయ ప్రత్యర్థులైనా సరే ఒప్పుకొనక తప్పదు. "భారతదేశంలోని ఒక రాష్ట్రముతా రాజకీయాలు–ఉత్తరప్రదేశ్ కాంగ్రెసు పార్టీ" అనే పుస్తకాన్ని శ్రీ పాల్. ఆర్. బ్రాస్ రచించారు దీన్ని 1960 లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయపు ప్రెస్‌వారు ప్రచురించారు. దానిలో– శ్రీ చరణ్‌సింగ్‌పై ప్రత్యర్థులు చేసే ఆరోపణల్లా, ఆయన గర్వపోతనీ, వ్యక్తిగత సంబంధాల నాధారం చేసుకొని సిద్ధాంతాలతో, నైతిక విలువలతో రాజీపడడని మాత్రమే"నని పేర్కొన్నాడు.

శ్రీ చరణ్‌ను గూర్చి ఆ గ్రంథంలో పేర్కొన్న కొన్ని అంశాల నిక్కడ ప్రస్తావించడం అప్రస్తుతంగాదు "ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం వ్యవసాయ మంత్రిగానున్న చౌదరీ చరణ్‌సింగ్ మీరట్ జిల్లా రాజకీయాలను, కాంగ్రెసును 1940 నుండీ తన ఆధీనంలో నుంచుకొన్నాడు. తన నాయకత్వాని కొచ్చిన ప్రతిబంధకాలన్నింటినీ అధిగమించాడు. ఉత్తర ప్రదేశ్ రాజకీయాల్లో విజయవంతమైన ముఠాకు నాయకుడయ్యాడు. ఆయనను తన అనుచరులు ఆప్యాయతగా, చౌదరీసాబ్ అంటారు. కేవలం స్పష్టమైన విధానాలకు, వాటి ఆచరణకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే శ్రీ చరణ్ తన వారికని ఏదో చేయడంగానీ లేక వ్యతిరేకులని నష్టపర్చడంగానీ లేదు." (పేజీ 139)

"శ్రీ చరణ్ రాజకీయాల్లో అంతటి మేధాసంపన్నుడు కాకున్నా-ఉత్తరప్రదేశ్ వ్యవసాయ సమస్యలను గూర్చి క్షుణ్ణంగా తెలుసుకోవాలని ఎంతో శ్రమించాడు, ఎంతో చదివాడు. జమీందారీ రద్దు చట్టాన్ని రూపొందించడంలో ఏమాత్రం లొసుగులు లేకుండా చేశాడు. రాష్ట్రంలో భూస్వామ్యవ్యవస్థ తిరిగి మళ్ళీ తలెత్తకుండా నడుం విరగ్గొట్టాడు" (పేజీ 140, 141) అని ఉటంకించారా గ్రంథంలో.

శ్రీ పాల్, ఆర్. బ్రాస్ పేర్కొన్నట్లుగా రాజకీయ నాయకుడిగా అంతటి విజయవంతం గావడానికొక ప్రధాన కారణం, నీతి-నిజాయితీలకు మారుపేరైన ఆయన వ్యక్తిగత జీవన విధానం. ఆ ఉన్నత విలువలు రాజకీయవేత్తలందరిలోనూ వుండాలని వేదికలెక్కి ఉపన్యసించే కాంగ్రెసు పెద్దలు, మానవ బలహీనతలకు లొంగిపోయి శ్రీ చరణ్‌ను చూసి అసూయపడేవారు.

శ్రీ చరణ్‌ను గూర్చి మరోమాటకూడా చెప్పుకోవాలి. ఆయన పుట్టింది - రాజకీయంగా ఉన్నతమైన కుటుంబంగాదు. రాష్ట్రంలో పెద్ద కులమూకాదు. ధనవంతమైన దంతకన్నా కాదు. 1966 డిశెంబరు 25 న నేషనల్ హెరాల్డు పత్రిక "ఆట లేక జూదము" అనే వ్యాసంలో- "రాజకీయాలు ఒక నిలకడలేని ఆట-చచ్చేంత కృతజ్ఞత లేనిఆట -రాజకీయమైన అదృష్టం అతి చంచలమైనది - దీనివల్ల పెక్కుమంది యిబ్బందిపడక తప్పదు దీనికి ఉదాహరణలు కోకొల్లలు - ఉత్తరప్రదేశ్‌లో శ్రీ చరణ్ ఉదాహరణే ఓ ప్రముఖమైనది. ముఖ్యమంత్రి కావడానికి కావలసిన అర్హతలన్నీ ఆయనకున్నాయి. కానీ ఆ పదవికాయన్నుగూర్చి ఆలోచించేవారేలేరు ఏమంటే ఆయన వెనుక బ్రాహ్మణ, వైశ్య, కాయస్థ, నిమ్న జాతులవంటి బలీయమైన రాజకీయ కులాలేవీ లేవు"-అని వ్యాఖ్యానించింది.

శ్రీ చరణ్ 1967లో కాంగ్రెసును వదిలిపెట్టాడు. అయితే ఎవరో అన్నట్లుగా పదవినాశించిగాదు- కాంగ్రెసు పెద్దల విశ్వాసఘాతుకాన్ని సహించలేక మాత్రమే. అప్పట్లోనున్న ఏ కాంగ్రేసేతర పక్షంలోనూ చేరక, నీతివంతమైన పరిపాలనకు, గ్రామీణాభివృద్ధికీ ప్రాధాన్యతనిచ్చే సొంతపార్టీని స్థాపించాడు, గాంధేయ పంథాలో. అదే భారతీయ క్రాంతిదళ్,

1977 జనవరి 8న మేడమ్ గాంధీకి వ్రాసిన లేఖలో ఈ విషయాన్ని స్పష్టపర్చాడు. 1967 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెసుకు 198, ప్రతిపక్షాలకు 227 స్థానాలు దక్కాయి, ఉత్తరప్రదేశ్‌లో. శ్రీ చరణ్ వర్గం ప్రతిపక్షాలతో కలిస్తే వారిబలం 276కి దాటుతుంది గనుక, ఆయనను ముఖ్యమంత్రి కమ్మని ప్రతిపక్షాలవారు ఒత్తిడిచేశారు. కానీ అప్పట్లో తనకు కాంగ్రెసును వదిలే ఉద్దేశ్యం లేదని, ఆ ప్రతిపాదనను త్రోసిపుచ్చాడు. నాయకత్వాన్నికూడా శ్రీ సి. బి. గుప్తానే తీసుకొమ్మన్నాడు. అయితే అవినీతికి ఆలవాలంగానున్న వారిని మంత్రులు తీసుకొనక, నిజాయితీ పరులకు వారి స్థానాల్లో నియమించాలనే ఒడంబడికపై శ్రీ గుప్తాను నాయకత్వాని కంగీరించాడు. ఈ ఒడంబడికను కాంగ్రెసు పెత్తందార్లు గాలి కొదలివేశారు. దానితో ఏప్రిల్ 1న కాంగ్రెస నుంచి రాజీనామాను ప్రకటించాడు, శాసనసభలో. ఆ రోజు సాయంత్రమే తిరిగి కాంగ్రెస్‌లో చేరి ముఖ్యమంత్రి పదవిని చేపట్టమని మేడమ్ గాంధీ దూతలను పంపినా శ్రీ చరణ్ అంగీకరించలేదు. 1977 జనవరిలో అప్పటి ప్రధాని మేడమ్ గాంధీ ఒక బహిరంగసభలో మాట్లాడుతూ కేవలంపదవినాశించే శ్రీ చరణ్ సింగ్ వంటివారు కాంగ్రెసునుండి వెలుపలికిపోయి, వేర్వేరు పార్టీలను స్థాపించారని విమర్శించినదానికి జవాబుగా పై విషయాలను ఉటంకిస్తూ శ్రీ చరణ్ పై జవాబు వ్రాశాడు. అప్పట్లో దౌత్యం జరిపిన శ్రీ ఉమాశంకర్ దీక్షిత్, శ్రీ దినేష్‌సింగ్‌లను, ఈ విషయాలపై రుజూ తీసుకోవాలనికూడా అన్నాడు, అవసరమైతే.

ముఖ్యమంత్రిత్వం :-

కాంగ్రెసును వదలిన చౌదరీ చరణ్‌సింగ్ జనసంఘ్, సంయుక్త సోషలిస్టుపార్టీ, ప్రజాసోషలిస్టుపార్టీ, స్వతంత్ర, కమ్యూనిస్టు, జన కాంగ్రెస్ (ఉత్తరోత్తరా యిదే భారతీయ క్రాంతిదళ్‌గా మారింది) వంటి ఏడుపార్టీలతోకూడిన సంకీర్ణ ప్రభుత్వంద్వారా, ఉత్తరప్రదేశ్‌కు నిర్మలమైన పరిపాలన నందజేశాడు. శ్రీ చరణ్ ముఖ్యమంత్రిగా నుండగానే షెడ్యూల్డు కులానికి చెందినవార్ని ప్రప్రథమంగా పబ్లిక్ సర్వీస్ కమీషన్ సభ్యునిగా నియమించడం జరిగింది అంతేగాక నలుగురు క్యాబినెట్

మంత్రులను, స్టేట్ మంత్రులలో మూడింట రెండొంతులు మందిని వెనుకబడిన తరగతుల వారినుండి నియమించాడు. జనాభాలో సగంపైగా. ఈ కులాలవారున్నా, 1937 నుండి 1967 వరకూ, ఈ కులాలవారినుండి మంత్రులుకాలేదు, ఒక్కరుకూడా. షెడ్యూల్డుకులల్లో భారు జాతుల తర్వాత ఉత్తరప్రదేశ్‌లో పెద్దజనాభా యున్నకులం పాసీలు. కానీకాంగ్రెసు చరిత్రలో, ఆ కులంనుండి ఒక్కర్నికూడా మంత్రిగా తీసుకొనలేదు. ఆ కులంనుండి ఒకర్ని శ్రీ చరణ్, క్యాబినెట్‌లోనికి తీసుకొన్నాడు.

జూన్ తర్వాత కులాలపేరుతో నున్న ఏ విద్యాసంస్థకు ప్రభుత్వ సహాయం ఉండడానికి వీల్లేదని శ్రీ చరణ్ ప్రకటించడంతో, ఉత్తరప్రదేశ్‌లో అటువంటి సంస్థలన్నీ కులాలపేరును వదులుకొనక తప్పలేదు. అందువల్లనే, ఆ రాష్ట్రంలో కులాలపేరుతో ఒక్క విద్యాసంస్థకూడా లేకుండా పోయిందప్పటినుండి. భయంతో దొంగ నిల్వదార్లు సరుకును, శ్రీ చరణ్ చేతికధికారంరాగానే, విడుదల చేయడంతో ధరలు తగ్గుముఖంపట్టాయి. వెనకెన్నడూ లేనంతగా గోధుమ ప్రొక్యూర్‌మెంటు ధరను క్వింటాలుకు రూ. 80–85కు పెంచాడు శ్రీ చరణ్ దూరదృష్టితో. ప్రొక్యూర్‌మెంటు పద్ధతిని ప్రవేశపెడితే. దాన్ని వ్యతిరేకించిన కాంగ్రెస్ ఆరేళ్ళతర్వాత అదే విధానాన్ని అమలుపర్చమని. అన్ని రాష్ట్రాలకు సిఫార్సుచేసింది.

యిదివరకెన్నడూలాని గరిష్ఠధర లభించింది. చెరకు రైతులకు. మామూలుగా సెప్టెంబరు–అక్టోబరు మాసాల్లో చివరి రోజుల్లో గోధుమ ధర పెరిగేది. కానీ మే–జూన్‌లలో రైతులమ్ముకునే దినాలలోకన్నా, నాటప్పుడు ధరలు తగ్గాయి. శ్రీ చరణ్‌సింగ్ అంటే హడలిపోయి, సరుకు నిలవచేసే ధైర్యమెవరికీ లేకపోవడమే, దీనిక్కారణం. శ్రీ చరణ్ కాలంలో రాష్ట్రంలో ఎక్కడా మచ్చుకైనా సమ్మెలేదు. శ్రీ చరణ్ కాలంలో శిక్షలధికంకాకున్నా, లంచగొండులకు గుండెల్లో గుబులు, హడలు. అయితే క్రమశిక్షణా చర్యల్లో మాదిరి సిఫార్సులకు తావులేదు. దేశంలో తొలుదొలుతగా, ఉత్తరప్రదేశ్‌లో శ్రీ చరణ్ ప్రజాసేవా రంగంలో నున్నవారిపై విచారణకు ఆర్డినెన్స్‌ను జారీచేయించాడు. శాసన సభ్యులు మున్సిపల్ అధ్యక్షులు, సమితిరాజులు, సహకార సంఘాల చక్ర

వర్తులవంటి వారినందర్నీ దీని పరిధిలోనికి తెచ్చాడు. నేరాల పరిశోధన కొరకు స్వతంత్రమైన సంస్థను నెలకొల్పాడు, అది ప్రభుత్వానికి జవాబుదారీ కాని, ఓ స్వతంత్రసంస్థ. ఈ ఆర్డినెన్స్‌నే తర్వాత కేరళ, ఒరిస్సావంటి యితర రాష్ట్రాలుకూడా చేపట్టాయి. అయితే శ్రీ చరన్ ముఖ్యమంత్రిగా రాజీనామాచేసిన తర్వాత, రాష్ట్రపతి దీన్ని ఉత్తరప్రదేశ్‌లో రద్దుచేయడం విడ్డూరం.

విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాలు ఉండితీరాలని లేదని ప్రకటించి 1970లో వాటినన్నింటినీ ఐచ్ఛికమైనవిగా మార్చాడు. దానితో సమ్మెలు, మూకుమ్మడికాపీలు, ఆడపిల్లలను వేధించడం తగ్గాయి. క్రమశిక్షణ నెలకొని, మొట్టమొదటిసారిగా విద్యాలయాల్లో పనిదినాలు పెరిగాయి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షిస్తూ శ్రీ చరన్‌కు వేలాది టెలిగ్రాంలు పంపారు.

అదేవిధంగా గూండా కంట్రోలు చట్టాన్ని తెచ్చాడు. అప్పటివరకూ కత్తులతో, కటార్లతో రోడ్ల వెంట సంచరించే గూండాలు, సంఘవిద్రోహ శక్తులు ఈ వార్త వెలువడడంతోనే మటుమాయమైపోయారు. ఆడపిల్లల్ని చదువుకొనడానికి పంపేందుకు భయపడే తల్లిదండ్రులకందరికీ కొత్త ధైర్యం వచ్చింది. సంకీర్ణ ప్రభుత్వంలోని జనకాంగ్రెస్ (టి కె.డి ) వినా మిగతా పక్షాలన్నీ ఉద్యోగుల జీతాలు పెంచాలన్నాయి. దీనివల్ల ప్రభుత్వానికి రూ 10 కోట్లవ్యయం పెరుగుతుంది గనుక వీల్లేదన్నాడు శ్రీచరన్. మూడుమాసాలనంతరం సంయుక్త సోషలిస్టులు, కమ్యూనిస్టులు దీనికి విరుద్ధంగా మరో ప్రతిపాదన తెచ్చారు దానిపై ఓ క్యాబినెట్ మంత్రి, మరో స్టేట్ మంత్రి రాజీనామా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీసే దుబారా ఖర్చులు చేసేకన్నా, పదవిని వదులు కొనడానికైనా సిద్ధమేనన్నాడు, చౌదరీ చరన్ సింగ్.

గుజరాత్, బీహార్, మధ్యప్రదేశ్ వంటిరాష్ట్రాలన్నింటా మతకలహాలు జోరుగా సాగుతూన్న ఆ రోజుల్లో, మహమ్మదీయుల జనాభా అత్యధికంగానున్న ఉత్తరప్రదేశ్‌లో మాత్రం శ్రీ చరన్ సింగ్ ముఖ్యమంత్రిగానున్నన్నాళ్ళు, మతకలహాలు మచ్చుకైనాలేవు.

క్రమశిక్షణ :-

1968 జనవరి 3 న వారణాసిలో జరుగుతున్న ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ మహాసభలకు, అప్పటి ప్రధాని మేడమ్ గాంధీ అధ్యక్షత వహించవలసి యున్నది. శ్రీ చరణ్ ముఖ్యమంత్రిగానున్న సంకీర్ణ ప్రభుత్వంలో 46 మందితో భాగస్వామిగానున్న సంయుక్త సోషలిస్టు పక్షంవారు మేడమ్ గాంధీని చుట్టుముట్టి, ప్రజలమధ్య నిలబెట్టి విచారిస్తామనే ఓ కార్యక్రమాన్ని పత్రికల్లో ప్రకటించారు, ప్రచారం గావించుకొన్నారు. రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడా ఊరివాడై యుండి, ఈ చర్యను నివారించలేక పోయాడు. కనీసం అది తప్పని ఖండించే ధైర్యంకూడా లేకపోయింది. కానీ చౌదరీ చరన్‌సింగ్ దృష్టిలో మాత్రం, ప్రధాని ఉత్తరప్రదేశ్‌లో నున్నంతవరకూ, అవసరమైన రక్షణ ఏర్పాట్లు చూడవలసిన బాధ్యత, ముఖ్యమంత్రిగానున్న తనది. పార్లమెంటు సభ్యుడు శ్రీరాజనారాయన్‌తో సహా, పెక్కుమంది సంయుక్త సోషలిస్టుపార్టీ నాయకులను, శాసనసభ సభ్యులను నిర్బంధించి, ప్రదర్శకులను చెదరగొట్టి, తానే దగ్గరుండి, స్వయంగా రక్షణతో వేదికవద్దకు తీసుకెళ్ళాడు, మేడమ్ గాంధీని. ఏ అవాంఛనీయ సంఘటనలకూ తావులేకుండా, మేడమ్‌గారి ఉపన్యాసం కొనసాగేట్లు చూశాడు. శ్రీ చరన్‌చర్య, సోషలిస్టులకు సహజంగా కోపకారణ మయ్యింది దీనివల్ల 17 ఫిబ్రవరిన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయవలసి వచ్చినాసరే, కొన్ని నైతిక విలువలు- సూత్రాలదృష్ట్యా శ్రీ చరన్ రాజీలేని మనస్తత్వం లెక్కచెయ్యలేదు. యిది శ్రీ చరన్‌క్రమ శిక్షణకు ఒక ఉదాహరణ మాత్రమే. యిటువంటి ఉదాహరణలు ఎన్నో, యింకెన్నో!

జయప్రకాష్ సంపూర్ణ విప్లవంతో సహా అన్ని జాతీయోద్యమా లోనూ అగ్రగామిగా నిల్చిన చౌదరీ చరణ్‌సింగ్, 1975 జూన్ 25న నిర్బంధించబడ్డా, సమైక్య జాతీయ ప్రతిపక్షా న్నేర్పర్చడంలో మాత్రం అశ్రద్ధ చూపలేదు 19 6 మార్చిలో జైలునుండి విడుదల చేయబడ్డా మేడమ్ గాంధీ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడుతూనేయున్నాడు. 1976 మార్చి 23న శాసనసభలో ప్రతిపక్ష నాయకునిగా, శ్రీ చరణ్‌సింగ్ చేసిన ఉపన్యాసం ప్రజాసామ్య ప్రియులందరికీ చిరస్మరణీయం.

జనతాకు శ్రీకారం :-

1977 జనవరిలో జనతాపార్టీ ఆవిర్భావానికి ప్రధాన కారకుడు. చౌదరీ చరణ్‌సింగ్. జనతాలో విలీనమైన మిగతా పక్షాల నాయకులందరూ, ఆ రోజుల్లో కేవలం ఫ్రంట్‌వంటి దాన్నేర్పాటు చేసుకొని, ఎన్నికల ఒప్పందాలతో కాలంగడపాలని చూశారు. దానికే మాత్రం అంగీకరించక, షరతులతో నిమిత్తంలేని సంపూర్ణ ఏకీకరణకు తక్కువైన ఏ ఒప్పందం తోనూ, తాముగానీ, తమ బి. యల్. డి గానీ భాగస్వామిగాదని నిర్ద్వం ద్వంగా ప్రకటించాడు శ్రీ చరణ్. చౌదరీసాబ్ ఈ విషయంలో అంత గట్టిగా లేకుంటే, జనతాపార్టీ ఆవిర్భవించక కేవలం ఎన్నికల ఒప్పందం తోనే కథ ముగిసేది. 1977 మార్చి ఎన్నికలలో జనతా విజయ ఢంకా మ్రోగించి, అధికారంలోనికి రావడంతో శ్రీ చరణ్‌సింగ్ కేంద్ర దేశీ యాంగ మంత్రిగా బాధ్యతను స్వీకరించాడు. ప్రధాని పదవికి పోటీచేసి, నెగ్గే అవకాశమున్నా, కేవలం, వయస్సులో పెద్దవాడని శ్రీ మొరార్జీ దేశాయికా అవకాశం యిచ్చాడు, ఆయనకున్న బలహీనతలు తెలిసికూడా. ప్రధానితోనున్న సిద్ధాంత విభేదాలు శ్రీ చరణ్‌సింగ్‌కు యిబ్బందిగా నుండేవి. యివి పైకొచ్చేటప్పటికి ప్రధాని పదవికున్న సహజమైన గర్వంతో, మదంతో దేశీయాంగశాఖను దెబ్బతీశాయి. దానితో 1978 జూన్ 30న శ్రీ చరన్‌సింగ్, దేశీయాంగ మంత్రిగా రాజీనామా చేశాడు. వాస్త వానికిది రాజీనామా కాదు, ఉద్వాసన దీనివెనుకనున్న వాస్తవాలను 1978 డిసెంబరు 21న పార్లమెంటులో వెల్లడించాడు, శ్రీ చరన్.

శ్రీ చరన్ దేశీయాంగ మంత్రి కాగానే ఉత్తరాదినున్న తొమ్మిది రాష్ట్రాల శాసనసభలను రద్దుపరచి ఎన్నికల ద్వారా జనతానధికారంలోనికి తెచ్చాడు. శ్రీ చరన్ ఈ సందర్భంలో పట్టుపట్టకుంటే, ఆ మీదట రాష్ట్రపతి ఎన్నిక ఏకగ్రీవంగా జరగడం, ఎగువ సభలో యిబ్బంది లేకుండా పోవడం వంటివి జరిగేవికాదు. రాజకీయాధికారంలోనున్న అవినీతిని తొల గించడానికై లోక్‌పాల్ బిల్లు తెచ్చాడు శ్రీ చరన్.

1979 ఫిబ్రవరిలో ఆర్థిక శాఖను చేపట్టిన శ్రీ చరన్ మూడు

వారాల అల్పవ్యవధిలోనే ప్రప్రథమ కిసాన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, గ్రామీణాభివృద్ధికై కొత్త వరవడికి శ్రీకారం చుట్టాడు.

1979 ఏప్రిల్ అంతాన భారత ప్రధాని బాధ్యతలను చేపట్టిన శ్రీ చరన్‌సింగ్ నేతృత్వంలో తర, తరాలుగా దోపిడీకి గురవుతూన్న వ్యావసాయ, గ్రామీణ రంగాల్లోని కోట్లాది జనం అభివృద్ధికి అవకాశాలు చిగురించాయి. తాను సదా ఆరాటపడే పల్లె జనావళీ ఉన్నతికి చౌదరీ చరన్ సింగ్ కంకణధారుడు కావడానే, బస్తీలలోని దోపిడీ వర్గానికి కడుపుమంట. వారి అభిరుచులకు దెబ్బ తగులుతుందనే ఆదుర్దావల్లనే ఈ పరాన్న భుక్కులకు కన్నెర్ర.

పదవి వుంటేనేగాని బ్రతకలేమనే తత్వంకాదు చౌదరీ చరన్ సింగ్‌ది. అన్యాయానికి, అక్రమానికి వ్యతిరేకంగా పోరాడడానికి పదవి నొక ఆయుధంగా వాడుకొన్నాడు-అవినీతిని, దోపిడీని అంత మొందించడానికై మంత్రి హోదానొక మార్గంగా వినియోగించుకొన్నాడు. సాంఘిక మార్పుల సాధనకై తన అధికారాన్నుపయోగించుకొన్నాడుగాని-దాన్నే ఒక లక్ష్యంగాను, పరమావధిగా మాత్రం ఎన్నడూ ఎంచలేదు.

సదా సన్నకారుకు, అందునా రైతాంగానికి సేవా చేయాలని, వారి ఉన్నతికి పాటుపడాలనే తపన చౌదరీ చరన్‌సింగ్‌ది. ఆయనలోనున్న ఆ జ్వాల, ఆ కాగడాను చేతిలోనిడుకొని సామాన్యుని, అట్టడుగునున్న వారి అభ్యున్నతికి-గాంధేయపంథాలో-ఎడ తెరిపిలేకుండా కృషి సల్పుతున్న కృషీవలుడు-చౌదరీ చరన్‌సింగ్.

చౌదరీసాబ్‌తో భేటీ :-

"నేను శ్రీ చరన్‌సింగ్‌ను చూడాలి. ఆయన ఏ గదిలోనున్నారు?" అని ఓ 70 ఏళ్ళ పైబడ్డ పెద్దాయన్ను అడిగినప్పుడాయన కళ్ళు మూసుకొని, తలకాయ వూపుతూ, ముక్కును నలుపుకొంటూ కూర్చున్నారు. ఉండీ లేనట్లుగా నున్న చిన్న-చిన్న వెంట్రుకలు, శుద్ధ ఖద్దరు పంచె,

చొక్కా, ఇలా అడిగినప్పుడక్కడే వున్న ఓ ఆరున్నరడుగుల భారీ కాయుడైన అంగరక్షకుడు ఏదో జరక్కూడనిది జరిగినట్లుగా నన్ను పట్టుకుని అవతలకి లాగేసే దానికి సిద్ధమయినాడు. ఆయన్నే శ్రీ చరన్ సింగు ఎక్కడని ప్రశ్నించిన నన్ను, బహుశః ఓ పిచ్చివాడి క్రింద జమ కట్టి వుంటాడు-ఆ అంగరక్షకుడు. కానీ అప్పటివరకూ శ్రీ చరణసింగ్‌ను చూడకపోవడాన, ఫొటోలు కూడా టోపీతో నుండడాన, మామూలుగా కూర్చున్నప్పుడు గుర్తు పట్టలేక ఆయన్నే అడిగాను.

ఇంతలో శ్రీ చరన్‌సింగు కళ్ళు తెరచి "నేనే చరన్‌సింగును. ఏం కావాలి?" అని అడిగారు. అది ఆగస్టు 18, గత సంవత్సరం. మధ్యాహ్నం 2-00 గంటల ప్రాంతం.

నేను హైకోర్టు ఆదేశం మేరకు జైలునుండి విడుదలయిన తర్వాత, అప్పటికింకా నిర్బంధంలోనేవున్న శ్రీలచ్చన్న కబురుచేసి, ఉత్తరాదిలోని వార్తలేమీ తెలియడం లేదని నన్ను ఓ మారు ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాలు పర్యటించి, విషయ సేకరణ చేసిరమ్మన్నారు. ఢిల్లీలోని కేంద్ర నాయకుల్లో జైలు వెలుపలనున్న శ్రీయుతులు హెచ్. ఎం. పటేల్, ఎస్. ఎం జోషి, సురేంద్రమోహన్, బలరాజ్ మధోక్, ఓ.పి. త్యాగి తదితర పెద్దలను కలసిన రెండు నాళ్ళకు శ్రీ భానూ ప్రతాప్‌సింగు, కాశ్మీర్ నుండి వచ్చారు. అప్పట్లో ఆయన భారతీయ లోక్‌దళ్ ప్రధాన కార్యదర్శి. ఇప్పుడు కేంద్రంలో ఆహార, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, ఇరిగేషన్ శాఖామాత్యులు. ఆయన ఇంతదూరం వచ్చి చౌదరీసాబ్‌ను కలవకపోవడం దేనికి? రేపు రాత్రికి బయల్దేరి, నాతో మీరట్ వస్తే అచ్చట జరిగే ఫిర్కా పార్టీ కార్యకర్తల సమావేశం చూసుకొనవచ్చు. చౌదరీసాబ్‌ను కలవచ్చునంటే బేంల్లీ పాసెంజర్‌లో బయల్దేరాం. తెల్లవారేసరికి స్టేషన్ చేరుకొన్నాం. ఓ 25, 30 మంది హడావుడిగా ఎదురొచ్చారు. అందులో ఓ తలపాగా చుట్టిపాతడొక్కు సైకిలేసుకొచ్చినాయన ఓ రిక్షాబండి తోలించుకొచ్చి మరింత హడావుడి చేశాడు.

ఆ పెద్దమనిషెవరని అడిగితే, శ్రీ భానూ ప్రతాప్‌సింగు "ఈ నియోజక వర్గంనుండి మనపార్టీ ఎం. ఎల్. ఏ" అంటే నాకు నమ్మ

శక్యం కాలేదు. అతి సాధారణమైన పాతగుడ్డలు, ఆ మురికి ఆ వెనుక బడిన తనం "ఇతడు ఎం. ఎల్. ఏ. ఏమిటి? ఎన్నికల కెంత ఖర్చు కాగలదు?" అనడిగితే ఓ పదివేల రూపాయల లోపని జవాబు చెప్పారు. శ్రీ ఖానూ. అందువల్లనే శ్రీ చరన్‌సింగు వెనక బలగం అంతటి అత్యవసర పరిస్థితి నిర్బంధంలోకూడా మిగిలివుంది. మన ప్రాంతం మాదిరి అది లక్షలతో కూడుకొన్న వ్యవహారమైతే అదంతా ఎలా రాబట్టు కోవాలనే తాపత్రయంతో అడ్డుదారులు త్రొక్కడం. ఆ నిర్బంధంలో కూడా శ్రీ చరన్‌సింగు పక్షపు నూరుమంది శాసన సభ్యులు చెక్కు చెదరలేదు.

డాక్ బంగళాకు పోగానే చెప్పారు. శ్రీ చరన్‌సింగు మీరట్ వెళ్ళిపోయారని. స్నాన-పానాదులు ముగించుకొన్నాక, వారి సమావేశంలో నన్నుకూడా మాట్లాడమన్నారు నా ఆంగ్ల ప్రసంగానికి శ్రీ ఖానూ హిందీ అనువాదం, ఆంధ్రశాఖ, పార్టీ కార్యదర్శిగా నన్ను పరిచయం చేశారు సమావేశం కొనసాగుతూండగానే నేను మీరట్ బయల్దేరాను. బస్సులో ముందు సీటు ఏర్పాటు చేశారు పార్టీ కార్యకర్తలు, డబ్బిచ్చి టిక్కెట్ తీసుకోబోతే "మీకు టిక్కెట్టేమటి? పాస్ వుంటుంది గదా?" అని ఆశ్చర్యపోయారు వారంతా. ఏమంటే అచ్చట తాలూకా పార్టీ కార్యదర్శికూడా ఓ ఎం. ఎల్. ఏ.నో, ఎం. ఎల్. సి.నో అయి వుంటుంటాడు ఖాయంగా. అటువంటిది ఆంధ్ర శాఖ కార్యదర్శి కా సౌకర్యం వుండక పోవడం, వారి కసహజంగా కనిపించింది.

మీరట్ సర్క్యూట్ హౌస్ వాచ్‌మన్ యింటికెళ్ళి శ్రీ చరన్ సింగ్ 5వ నెంబరు గదిలో ఉన్నారని తెలుసుకొని అచ్చట నుండి వెనుక ద్వారంగుండా, ప్రవేశించి, గుర్తు పట్టక అలా ప్రశ్నించడం, ఆయన్నే "శ్రీ చరణసింగ్ ఏక్కడ?" అని నేను ఫలానా అని చెప్పినాక. కూర్చో బెట్టి, సమైక్య జాతీయ ప్రతిపక్షం ఏర్పాటులో తాము సల్పుతున్న కృషి అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంవంటి పెక్కు విషయాలు ఓ 3,4 గంటలు చర్చించారు. అంతసేపూ తండోప తండాలుగా జనం వచ్చి, శ్రీ చరన్ కాళ్ళకు నమస్కరించి పోవడం నాకు చిత్రంగా తోచింది. "శ్రీమతి గాంధి చాలా చిత్రంగా మాట్లాడు

తున్నది. దేశాభివృద్ధి, ఎన్నికలకంటే చాలా ముఖ్యం అంటారు. ఈ రెంటికీ పోలికేమిటో ఆమెకే తెలియాలి. మా పల్లెల్లో ఓ సామెతుంది. పది బర్రెలున్నాయి, అందులో నాలుగు చనిపోయాయి. ఎన్ని ఆవులు మిగులుతాయి? ఈ మాదిరి వుంది ఆమె వాదన" అని చమత్కరించారు. శ్రీచరణసింగ్ సంభాషణలో. దేశంలోని వివిధ ప్రాంతాలలోనున్న వివిధ రాజకీయ పార్టీలు, నాయకులు, వారి శక్తి యుక్తులు గూర్చి చాలా కూలంకషంగా చెప్పారు. అప్పట్లో ఒరిస్సాకు చెందిన శ్రీ సింగ్‌దేవ్ కుటుంబీకులు, ప్రతిపక్షంనుండి జేరుకొనడాన్ని గూర్చి "వారు చాలా పెద్దవారు. మనతో తంటాలు పడలేరు" అన్నారు.

ఎన్నికలొస్తే, ఉత్తరాదిన నూటికి తొంభై సమైక్య ప్రతిపక్షం గెలవడం ఖాయమన్నారు. షరతులు లేని విలీనీకరణ వినా ఏ ఒప్పందం ప్రంటుకు ఇష్టం లేదని విస్పష్టంగా ప్రకటించి ఆ దెసలో కృషిచేశారు. వ్యాపారస్తులు, పారిశ్రామిక వేత్తలంటే ఈసడింపు. దానివల్లనే వారినుండి చందాలు కూడా స్వీకరించ కూడదన్నారు. గ్రామీణ ప్రజానీకం రైతాంగం దుస్థితిని గూర్చి ఎంతో ఆందోళన వ్యక్త పర్చారు.

చివరకు వెళ్ళొస్తానంటే వీల్లేదన్నారు. "నేను కారు పంపాను. టీ, టిఫిన్ కొరకై తీసుకున్నాక వెళ్ళొచ్చు"—అని ఆదేశించి చివరికి రాబోయే ముందు బయటి వరకూ వచ్చి కారెక్కించి బస్‌స్టాండు వరకూ తీసికెళ్ళి బస్సెక్కించమని అచ్చటి వారిని పంపారు.

కొందర్ని గూర్చిన మనకున్న ఉన్నతాభిప్రాయాలు, వార్ని కలసిన తర్వాత సన్నగిల్లుతాయి. మరి కొందరిపై మరింత పెంపొందుతాయి. ఈ రెండవ కోవకి చెందుతారు శ్రీ చరణసింగ్.

—డా. యలమంచిలి శివాజీ

(ఆంధ్ర పత్రిక సెప్టెంబరు. 25. 1977. సౌజన్యంతో)

## శ్రీ చరణ్‌సింగ్ బడ్జెట్ : ఒక పరిశీలన

శ్రీ చరన్‌సింగ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతి పాదనలలో పెక్కు పేర్కొనదగ్గ అంశాలున్నాయి. ఆర్థికశాఖచే చేపట్టిన మూడు వారాల స్వల్ప వ్యవధిలోనే మొత్తం బడ్జెట్టుకు కొత్త రూపాన్ని, కాంగ్రెస్ త

ఒరవడిని తేగలగడం శ్రీ చరణ్ శక్తి సామర్థ్యాలకు, ధైర్యసాహసాలకు చిహ్నం. ఆ శాఖను చేపట్టేప్పుడే ప్రధాని శ్రీదేశాయికి పెద్ద మార్పులు చేయనని మాట యిచ్చాడని, ఇంత పెద్ద బ్యూరోక్రసీ మూసను కాదని ఈ పల్లెటూరి పెద్దమనిషి ఏమి చేయగలడులే? అని పెదవి విరచిన బస్తీల లోని మధ్య తరగతి మేధావి వర్గాలవారికి ఈ బడ్జెట్టు మ్రింగుడు పడక దానిపై వారు విరుచుకు పడడం విడ్డూరంకాదు. ప్రభుత్వ వ్యయ పరిశీలనకు ఒక కమిషన్‌ను ప్రతిపాదించడం ఈ బడ్జెట్ ప్రత్యేకత.

1979-80 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వాదాయం రూ 16,551 కోట్లు కాగా, వ్యయం రూ 18,526 కోట్లుగా అంచనావేశారు ఈ రకంగా తేలిన రూ. 1676 కోట్ల లోటులో రూ 620 కోట్లు అదనపు పన్నుల ద్వారా పూడ్చవచ్చునని, నికరం లోటు రూ 1355 కోట్లుండగలదని లెక్కలు వేశారు.

కాలం గడుస్తున్న కొద్దీ జాతి అవసరాలు పెరుగుతున్నాయి. దానికనుగుణంగా ప్రగతిని సాధించాలంటే మనం కొత్తవనరులను వెతుక్కొనక తప్పదు. వాటిలో ప్రధానమైనది పన్నుల విధింపు.

1965-66లో కేంద్ర ప్రభుత్వానికి పన్నుల రూపేణా వచ్చిన ఆదాయం రూ 2,06 కోట్లు. అది 1973-74కల్లా రూ 5,032కోట్లు అయింది ఈ బడ్జెట్‌లో 10,822 కోట్లకు పెరిగింది.

ఏడవ ఫైనాన్స్ కమిషన్‌వారి సిఫార్సుల ప్రకారం కేంద్రప్రభుత్వంవారు రాష్ట్రాలకు పన్నులలో ఇచ్చే వాటా పెరిగింది. ఈ బడ్జెట్ అంచనాల ప్రకారం, ఆ మొత్తం రూ 3,235 కోట్లు. అంటే ప్రస్తుత సంవత్సరానికన్నా రూ 1,278 కోట్లు అధికమన్నమాట. దీన్ని తీసివేస్తే కేంద్రం నికరవసూళ్ళు రూ 7,588 కోట్లు. అంటే ఈ సంవత్సరంకన్నా రూ 620కోట్లు తక్కువన్నమాట. జనతా ప్రభుత్వం వారి అధికార వికేంద్రీకరణ విధానానికి అనుగుణంగానే రాష్ట్రాలకిచ్చే కేటాయింపులు కూడా పెరిగాయి. వీటికితోడు రాష్ట్రాల ఓవర్ డ్రాఫ్టుల అప్పులు తీర్చడానికి రూ 555 కోట్లు అదనపు కేటాయింపులు.

పన్నుల భారం ఎవరిపై

ఈ పెంచిన పన్నులు ఏ ఏ వస్తువులపై ఏ ఏ వ్యక్తులు మోసే విగా వున్నాయన్నది ప్రశ్న. సిగరెట్లు, సబ్బులు, టూత్‌పేస్టులు, బిస్కట్లు, కవర్లు, స్టీల్ ఫర్నిచరు. స్టీరియో రేడియోలు, సమశీతల యంత్రాలు, కార్లు, స్కూటర్లు, పెట్రోలు, డీసెలు, కిరసనాయిలు వంటి వాటిపై సుంకాలు హెచ్చినాయి. ఆదాయపు పన్ను కూడా హెచ్చింది. దీనికే మధ్య తరగతి మేధావులు, బస్తీబాబులు పెడబొబ్బలు పెట్టడం. దీనివల్ల ఎవరికి ఇబ్బంది? దేశంలో కోట్లాది జనం అసలు పంచదారంటే ఎలా వుంటుందో చూడకబోతే. వారి పాపాన వారిని వదిలేసి సబ్బులు, పేస్టులు, స్కూటర్లు, కార్లు వాడుకొనేవారికి సౌకర్యం కల్పించాలా?

శ్రీ చరన్ పన్నుల పెంపుదల ప్రతిపాదనలు కూడా కొంగొత్త పరవడిని ప్రవేశపెట్టాయి, సబ్బుల ధరలు పెరిగాయి. ఇందుకు బాధపడే వారు ఖాదీ గ్రామోద్యోగ సంస్థలు తయారుచేసేవి వాడు కొనవచ్చు- వాటికి పన్ను తగ్గించారు కదా! అదేవిధంగా పెద్ద పరిశ్రమలలో తయారయ్యే అగ్గిపెట్టె మూడు పైసలు పెరుగుతుంది. దానికి బదులు కుటీర పరిశ్రమ అగ్గిపెట్టెలకు ఉన్నదానికన్నా ధర మూడు పైసలు తగ్గింది గదా!

ఇంక కిరసనాయిలు ధర పెరగడంవల్ల సామాన్య జనం ఇబ్బంది పడేమాట వాస్తవమే. కాని డీసెల్ ధరకన్నా కిరసనాయిలు ధరయే బాగా, తేడావుంటే వాహనాలలో డీసెల్‌కు మారుగా దీన్నివాడి, సామాన్యునికి అసలు కిరసనాయిలే దొరక్కుండా పోయే ప్రమాదం వున్నది. గతంలో ఇట్టి భయాలు, సందేహాలు వాస్తవమేనని రుజువైనాయి.

శ్రీ చరన్‌సింగ్ తనబడ్జెట్ ప్రతిపాదనలలో గ్రామీణ,వ్యవసాయ రంగాభివృద్ధికి అగ్రతాంబూలం యిచ్చాడు. నీటి పారుదల సౌకర్యాలకల్పనకై రూ. 1·88 కోట్లు కేటాయించి, ఈ ఏడు 32 లక్షల ఎకరాలకు అదనంగా నీరు అందించాలని లక్ష్యంగా పెట్టడం జరిగింది. ఎరువుల ఉత్పత్తికి కొత్తగా రూ. 254 కోట్లు కేటాయించారు.మన పల్లెసీమలలో నిరుద్యోగం, పాక్షికోద్యోగం అధికం. సంవత్సరంలో సగంరోజులు పనే దొరకదు,

అందుకే పనికి ఆహారం పథకానికి కేటాయింపులను రూ. 30 కోట్లనుండి రూ. 100 కోట్లకు పెంచారు. దీనివల్ల 40 కోట్ల పనిదినాలు లభ్యంకాగల వని అంచనా.

విద్యుత్ సరఫరా :-

అదేమాదిరి పాడి పరిశ్రమాభివృద్ధికికూడా కేటాయింపులు రూ. 11 కోట్లకు మరొక రూ. 19 కోట్లను కలపడం జరిగింది. గ్రామీణ విద్యుదీ కరణకు రూ. 285 కోట్లు కేటాయించడంద్వారా 25 వేల గ్రామాలకు కొత్తగా విద్యుత్ సరఫరా చేయాలని బడ్జెట్ లక్ష్యం.

గ్రామీణ మంచినీటి సరఫరాకు రూ. 80 కోట్లు కేటాయించి, 27 వేల గ్రామాలకు రక్షిత మంచినీటి సరఫరాను ఏర్పరచగలమన్నారు శ్రీ చరన్. చేనేత సహకారసంఘాలకు రూ. 28 కోట్లు కేటాయించారు. తద్వారా 270 కోట్ల మీటర్ల గుడ్డను తయారు చేయగలమన్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాలలో అయిదువేల తపాలా కార్యాలయాలను ఈ సంవత్సరంలో కొత్తగా ఏర్పాటు చేయగలమన్నారు.

ఇంతవరకు ఏ విధమైన పథకాలకు,అభివృద్ధికి నోచుకొనని 2 వేల బ్లాకులను రు. 258 కోట్లు వ్యయంతో, ఈ సంవత్సరం అభివృద్ధి పర్చగల మన్నారు. మొత్తంమీద ప్రస్తుతం రు. 1755 కోట్లతో వున్న గ్రామీణ వ్యవసాయాభివృద్ధి ప్రణాళికను రు. 1811 కోట్లకు హెచ్చించారు.

ముడిపొగాకు :-

ఇక ఎరువులపై ఎక్సయిజ్ సుంకాన్ని 50 శాతం తగ్గించారు ఖాదీ గ్రామోద్యోగ సంఘాలను ఆదాయపు పన్నునుంచి మినహాయించారు. మర నాగళ్ళపై, ముడిపొగాకు పైన సుంకం పూర్తిగా రద్దయింది. ముడిపొగా కుపై ఎక్సైజ్ సుంకం 1943 లో ఉప్పు పన్నుతోపాటు ప్రవేశపెట్టబడి, అలాగే కొనసాగుతున్నది. దానివల్ల రైతులు, వ్యాపారులు అనవసరంగా ఈ శాఖవారు కల్పించే యిబ్బందులకు గురై నానా యిబ్బంది పడు తున్నారు. శ్రీ చరన్ తన బడ్జెట్ ప్రసంగంలో వాక్రుచ్చినట్టుగా, ఒక్క

కలం పోటుతో లక్షలాదిమంది పొగాకు రైతాంగం ఎక్సైజ్ శాఖవారి కబంధ హస్తాలనుంచి రక్షించబడ్డారు.

వ్యవసాయ ఋణాలపై పన్నును ఒక శాతం తగ్గించారు. పల్లె ప్రాంతాల సబ్సిడీతో గిడ్డంగులను నెలకొల్పడం, వ్యవసాయ దిగుబడుల ఎగుమతుల ప్రోత్సాహానికి, చర్యలు గైకొనడం జరుగుతుందన్నారు.

జీవితభీమా, ప్రావిడెంట్ ఫండ్ వంటి పథకాల క్రింద పొందే రాయితీలు కొంత కత్తిరించబడ్డాయి. విలాసవంతమైన హోటల్ ఛార్జీలపై కొత్త సుంకాలను విధించారు. 11 వ షెడ్యూల్‌లోవున్న మద్యపానీయాల తయారీ, ఫర్నిచర్, పొగాకు ఉత్పత్తులు, గాజు సామగ్రి, ప్రెషర్ కుక్కర్, టేపు రికార్డర్లవంటి 23 రకాల నాన్ ప్రయారిటీ పరిశ్రమల కిచ్చిన పన్నుల రాయితీలను రద్దుచేసి 22 ప్రాణావసరమైన మందులపై వున్న ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దుచేశారు. సహకార సంఘాల ఆదాయపు పన్ను మినహాయింపుకు రూ. 20 వేల నుంచి రూ. 40 వేలకు పెంచారు.

అయితే గత పార్లమెంటు ఎన్నికలలో జనతాపార్టీ తన ఎన్నికల ప్రణాళికద్వారా ప్రజానీకాని కిచ్చిన వాగ్దానాలకు, ఆపైన ఉత్తరోత్తరా పార్టీ ఆమోదించిన ఆర్థిక ప్రణాళికావిధానానికి అనుగుణంగానే ఈ ప్రతిపాదనలు వున్నాయి. అంతేకాక, శ్రీ చరన్‌సింగ్ ప్రధాన పోషకులుగా వున్న కిసాన్ సమ్మేళన్ ఆందోళన చేస్తున్నది. వీటిని అమలు పరచాలనే కదా!

అందుకే శ్రీ చరన్ అన్ని ఒత్తిడులను తట్టుకొని, ఎన్ని ఎదురుగాలులనైనా ఎదుర్కొని, కిసాన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాడు. దేశంలో ఇంతకాలం నిర్లక్ష్యం చేయబడ్డ వ్యవసాయ రంగాభివృద్ధికి చేయవలసింది ఇంకా ఎంతోవున్నా, ప్రస్తుత బడ్జెట్ ప్రతిపాదనలు గ్రామీణాభ్యుదయానికి కొత్త ఊపిరి. వ్యవసాయరంగ ప్రగతికి కొత్త అవకాశం. ఈ ఒరవడిలోనే కొంతకాలం మనం పయనిస్తే,జాతి అభివృద్ధికి కొత్త కవాటాలు తెరుచుకొంటాయి.

—డా॥ యలమంచిలి శివాజీ, (ఆంధ్రజ్యోతి 1979 మార్చి 6.)